## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం






JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:356 | గురువారం సెప్టెంబర్ 03, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00




## అయోధ్య రామాలయ తొలి సీఈవోగా జితేంద్ర మిశ్ర

- తొలి సీఈవోగా జితేంద్ర మిశ్ర ఎంపిక
- విశ్రాంత ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్ర
- 39 ఏళ్లపాటు వాయుసేనలో సేవలు
- 5,585 దరఖాస్తుల పరిశీలన
- 16 మందికి ఇంటర్వ్యూలు

2 లో



## బెంగళూరు ట్రాఫిక్ కష్టాలు.. కర్ణుడికీ తప్పలేదట!

సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరొందిన బెంగళూరు.. ట్రాఫిక్ కష్టాలకూ చిరునామా. 'రెండు కిలోమీటర్లకు గంటపైనే పట్టింది' అనడం ఇక్కడ సర్వసాధారణం. అందుకే ఈ రోడ్లపై నిత్యం జోకులు పేలుతుంటాయ్.

పేజి 2లో ▶

## జనసేన యువజన విభాగం 'జై కొట్టు'




2 లో

- 'జై కొట్టు' లోగో ఆవిష్కరణ
- పిఠాపురంలో జరిగిన సభలో ఆవిష్కరణ
- లోగోను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- కార్యకర్తలకు పవన్ కల్యాణ్ ఆడియో సందేశం
- యువతకు రాజకీయాల్లో ప్రత్యేక స్థానం

## డీఆర్‌డీఎల్‌కు ఉచితంగా భూమి కేటాయించాలి.. రక్షణ మంత్రిని కోరిన సీఎం రేవంత్

### రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ



- డీఆర్‌డీఎల్‌కు ఉచిత భూమి కోరిన సీఎం
- ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం
- రక్షణ ఎక్స్‌పోలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి
- ఆదిలాబాద్ విమానాశ్రయంపై చర్చ
- ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ
- మరో 750 ఎకరాలు సేకరించేందుకు సిద్ధం
- రామ్మోహన్‌నాయుడితోనూ రేవంత్ భేటీ
- ఆదిలాబాద్, మామునూరు ఎయిర్‌పోర్టులపై చర్చ

దిల్లీ: దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమయ్యారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు రక్షణమంత్రిని ఆహ్వానించారు. గ్లోబల్ సమ్మిట్ రక్షణ ఎక్స్‌పోలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని సీఎం కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాజ్‌నాథ్‌తో చర్చించిన సీఎం.. ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టినట్టు తెలిపారు. మరో 750 ఎకరాలు సేకరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. మంత్రి వివేక్, ఎంపీలు మల్లు రవి, బలరామ్ నాయక్, అనిల్ యాదవ్ తదితరులు సీఎం వెంట ఉన్నారు.

రామ్మోహన్‌నాయుడితో రేవంత్ భేటీ

పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. ఆదిలాబాద్, మామునూరు సహా ఇతర ఎయిర్‌పోర్టుల అంశం ఆయన చర్చించారు.

పేజి 2లో ▶

## కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు: మంత్రి పొంగులేటి



- టీఆర్‌పై మంత్రి పొంగులేటి విమర్శలు
- హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరన్న మంత్రి
- కాంగ్రెస్ పాలనలో రైతులకు అండ
- వరి సాగులో తెలంగాణ నంబర్ వన్
- 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు
- గత ప్రభుత్వ అప్పులు చెల్లిస్తున్నాం
- రెండేళ్లలో 15 లక్షల రేషన్ కార్డులు
- కొత్తగా 3 లక్షల మందికి పింఛన్లు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలు తీర్చేందుకు కృషి చేశామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమైన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. ప్రజల అవసరాలకు అనుగుణంగా తమ పాలన కొనసాగుతోందని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై ఆయన విమర్శలు గుప్పించారు.

పేజి 2లో ▶

## నాపై ఎవరు ఆరోపణలు చేయించారో తెలుసు: మంత్రి కొండా సురేఖ



- కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని విజ్ఞప్తి
- ఖర్గేకు తన వివరణ ఇచ్చిన సురేఖ
- పదవిలో కొనసాగించాలని అధిష్ఠానానికి వినతి
- అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని వెల్లడి
- తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పన్న మంత్రి

2 లో

## ప్రేమ్‌కుమార్ మృతి కలచి వేసింది: పవన్



## రెండు ఆర్టీసీ బస్సులు ఢీ..!



తాళ్లరేవు: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి వద్ద 216వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కాకినాడ నుంచి అమలాపురం, అమలాపురం నుంచి కాకినాడ వెళ్తున్న రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. బస్సుల్లో వెళ్తున్న ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారు. క్షతగాత్రలును 108లో కాకినాడ ఆసుపత్రి తరలించారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం: కేటీఆర్



2 లో

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (ఖు=) విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

## ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర కావడం ఖాయం: సీఎం చంద్రబాబు

- నదుల అనుసంధానమే లక్ష్యం
- ప్రతి ఎకరాకూ సాగునీరు
- ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- వచ్చే ఏడాది సింహాద్రికి నీళ్లు
- సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలు



పాయకరావుపేట: గోదావరి, కృష్ణా సహా రాష్ట్రంలోని అన్ని నదులనూ అనుసంధానం చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు (జఘ్రుఅంతీఖుఝుఎబ) అన్నారు. ప్రతి ఎకరాకూ నీళ్లిచ్చి జలహారతితో తెలుగుతల్లి రుణం తీర్చుకుంటామని చెప్పారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పీఎల్ పురం వద్ద పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలుగా నమ్ముతున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర కావడం ఖాయమన్నారు.

పేజి 2లో ▶




# సమాచార హక్కు చట్టం-2005 పట్ల పిఐఓల నిర్లక్ష్యం

### సహ చట్టం గురించి పిఐఓలకు తెలుసా..? -రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్టివిస్ట్ సొసైటీ (అర్టీఐఎఎస్)-రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర. కిషన్ నాయక్

**రంగారెడ్డి జిల్లా న్యూస్ ( సెప్టెంబర్ 2) జనసముద్రం**




సమాచార హక్కు చట్టం పట్ల పిఐఓల నిర్లక్ష్యం. సహ చట్టం గురించి పిఐఓలకు తెలుసా..? సమాచార హక్కు చట్టం పట్ల పలువురు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్స్ (పిఐఓలు) నిర్లక్ష్యం వహిస్తూ సహ చట్టాన్ని నిరుగారుస్తున్నారు. అసలు సమాచార హక్కు చట్టం పట్ల ఏమాత్రం అవగాహన లేనివారు సైతం పిఐఓలుగా విధులు నిర్వహించడం మూలంగా వారికి సహ చట్టం అంటే ఏమిటో, సహ చట్టం కింద దరఖాస్తులకు సమాధానం ఎలా ఇవ్వాలి, ఎన్ని రోజుల్లో సమాచారం ఇవ్వాలి అనే ప్రాథమిక సమాచారం కూడా తెలియని వాళ్లు సహ చట్టం పిఐఓలు. అసలు సహ చట్టం అంటే ఏమిటి సహ చట్టాన్ని ఎలా ఉపయోగించుకోవాలి? అనే విషయాలు స్పష్టంగా తెలుసుకుందాం రండి.

సమాచార హక్కు చట్టం గురించి ప్రజలు తెలుసుకోండి. సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడు తెలుసుకోవాల్సిన సహ చట్టం సెక్షన్లు. సమాచార హక్కు గురించి మీకు పూర్తిగా తెలుసా..?

సమాచారం ఇవ్వకపోతే ఆ ప్రజా సమాచార అధికారి ఐపిసి సెక్షన్లు 166, 167, 217, 218, 219, 220, 420, 406, 407, మరియు 408 నేరపరిధిలోకి వస్తారు. కాబట్టి సహ చట్టం కింద దరఖాస్తు దారులు కోరిన సమాచారాన్ని ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి. లేని పక్షంలో సమాచార నిబంధనలు ఉల్లంఘించినందుకు చట్టాన్ని దుర్వినియోగం చేసినందుకు గాను పై సెక్షన్ల ప్రకారం కేంద్ర, రాష్ట్ర కమీషనర్లు కూడా సమాచారం ఇవ్వని వారిని జైలుకు పంపవచ్చని చట్టంలో పేర్కొనబడింది. ఒకవేళ పూర్తి అవగాహన లేకపోతే క్రింది వివరాలు చూడండి.

"సమాచార హక్కు ప్రతి దరఖాస్తుదారుడు ... వినియోగదారే" 30 రోజుల్లో సమాచారం ఇవ్వకపోతే వినియోగదారుల ఫోరమ్ వెళ్ళవచ్చు.

సమాచారాన్ని దరఖాస్తు ఫారం లేదు. కావలసిన సమాచారం తెల్లకాగితంపై రాసి పిఐఓ (ప్రజా సమాచార అధికారి) కి అడగవచ్చు. అధికారికి డైరెక్ట్ గా గాని రిజిస్టర్ పోస్టు ద్వారా అయినా పంపి అడగవచ్చు. దరఖాస్తు దారునికి వయస్సు, స్థానికత అవసరం లేదు.

సెక్షన్ 2 (ఎఫ్) ప్రకారం: సమాచార నిర్వచనం. (కార్యాలయాల్లో రికార్డులు, పత్రాలు, మెమోలు, ఈ-మెయిల్స్, అభిప్రాయాలు, పుస్తకాలు, ప్రకటనలు, సీడీలు, డివిడీలు, మొదలైనవి).

సెక్షన్ 2 (హెచ్) ప్రకారం: సమాచార చట్ట పరిధిలోకి వచ్చే కార్యాలయాలు (ప్రభుత్వంచే గుర్తింపు పొందిన, స్వచ్ఛంద సంస్థలు).

సెక్షన్ 2(ఐ) ప్రకారం: రికార్డు నిర్వచనం.

సెక్షన్ 2(జె) ప్రకారం: ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలు పరిశీలించవచ్చు. ఏ ప్రభుత్వ కార్యాలయంలో రికార్డులనైనా దరఖాస్తు చేసుకుని తనిఖీ చేయవచ్చు. అవసరం అయితే జిరాక్స్ చేసుకోవచ్చు.

సెక్షన్ 2(జె)(అ) ప్రకారం: పనులను, పత్రాలను తనిఖీ చేసే హక్కు (ఒక గంటకు రూ. 5/-).

సెక్షన్ 3 ప్రకారం: వెల్లడించవలసిన సమాచారం ఎవరూ అడగక ముందే ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి.

సెక్షన్ 4(1)(ఎ), (బి) ప్రకారం: నిర్ణయాలు వాటికి గల కారణాలు చెప్పక్కరలేదు (సమాచారం ఎందుకు అని చెప్పక్కరలేదు).

సెక్షన్ 4(2) ప్రకారం: వీలైనంత ఎక్కువగా స్వచ్ఛందంగా ఇవ్వవలసిన సమాచారం.

సెక్షన్ 4(4) ప్రకారం: స్థానిక భాషలో ఇవ్వాలి.

సెక్షన్ 5(1), (2) ప్రకారం: ప్రజా సమాచార అధికారులు (పిఐఓ) / అప్పీలేట్ అధికారుల నియామకం.

సెక్షన్ 6(1) ప్రకారం: సమాచార హక్కు దాఖలు విధానం.

సెక్షన్ 6(2) ప్రకారం: సమాచారం ఎందుకో చెప్పనక్కర్లేదు.

సెక్షన్ 6(3) ప్రకారం: కోరిన సమాచారం సంబంధిత శాఖ అధికారికి దరఖాస్తు బదిలీ (సమాచారం మరో కార్యాలయానికి పంపవలసిన బాధ్యత అధికారులదే).

సెక్షన్ 7(1) ప్రకారం: 30 రోజులలోపు సమాచారం ఇవ్వవలసిందే... వ్యక్తి జీవితానికి, స్వేచ్ఛకు సంబంధించింది అయితే 48 గంటల లోపే ఇవ్వాలి.

సెక్షన్ 7(3)(బి) ప్రకారం: సమాచార రుసుము (కోర్టు సంబంధించని మాత్రం రూ. 25/-. మిగతా శాఖ వారికి రూ. 10/- మాత్రమే చెల్లించాలి). ఏ రూపంలో వేయాలి? బ్యాంకర్స్ చెక్కు రూపంలో మాత్రమే దరఖాస్తు రుసుము అకౌంట్ అధికారి పేరిట పంపించాలి.

?విలయసంతంత (చిరునామా) పోస్టల్ ఆర్డరు మాత్రమే రుసుముగా చెల్లించాలి. (ప్రతి పేజీకి ఎ-4, ఎ-3 రూ. 2/- చొప్పున, సీడీకి రూ. 100/- చొప్పున, ఫ్లాపీకి రూ. 50/- చొప్పున, డివిడీ రూ. 200/- చెల్లించాలి. కోర్టు లో ప్రతి పేజీకి రూ. 5/- చొప్పున చెల్లించాలి).

సెక్షన్ 7(1) ప్రకారం: దరఖాస్తు గడువు 30 రోజులు.

సెక్షన్ 7(6) ప్రకారం: గడువులోపు సమాచారం ఇవ్వకుంటే సమాచారం ఉచితంగా ఇవ్వాలి.

సెక్షన్ 8(1) ప్రకారం: సమాచారం మినహాయింపులు ( దేశరక్షణ సంబంధించి ఒప్పందాలు).

సెక్షన్ 8(2) ప్రకారం: అడిగిన సమాచారంలో ప్రజాప్రయోజనం ఉంటే మినహాయింపులు వర్తించవు.

సెక్షన్ 18(1) ప్రకారం: కమీషన్ కు ఫిర్యాదు, విదివిదనాలు

18(3)- ఫిర్యాదు విచారణ సందర్భంలో కమిషన్ల అధికారాలు

సెక్షన్ 19(1) ప్రకారం: మొదటి అప్పీలు.

సెక్షన్ 19(3) ప్రకారం: రెండవ అప్పీలు 90 రోజుల లోగా రాష్ట్ర, కేంద్ర సమాచార కమీషన్ కి అప్పీల్ చేసుకోవాలి. సరైన కారణాలు ఉంటే 90 రోజుల తరువాత అప్పీల్ చేసుకోవచ్చు.

సెక్షన్ 19(1) కమీషన్ల నిర్ణయాలు: సెక్షన్ 19(8)(ఎ)(బి ) ప్రకారం దరఖాస్తుదారు తనకు కలిగిన ఆర్థికపరమైన కష్టనష్టాలపై కమీషన్ ఆధారాలు సమర్పించాలి. సక్రమంగా ఉంటే నష్టపరిహారం మంజూరు చేయాలి.

సెక్షన్ 20(1) ప్రకారం: సమాచారం ఇవ్వకపోతే (తప్పుడు సమాచారం ఇస్తే) రోజుకు రూ. 250 చొప్పున వరకు రూ. 25,000 జరిమానా.

సెక్షన్ 20(2) ప్రకారం: క్రమశిక్షణ చర్యలకు సిఫారసు.

?గడువులోగా సమాచారం ఇవ్వకపోతే వినియోగదారుల ఫోరమ్ కు వెళ్లవచ్చు. బిసిడబ్ల్యూ తప్పుడు సమాచారం ఇస్తే రాష్ట్ర కమీషనర్ లేకుంటే డైరెక్ట్ గా న్యాయస్థానానికి వెళ్లవచ్చు. రెండవ షెడ్యూల్ లోని నిఘా భద్రతా సంస్థల్లో సెక్షన్ 24(1) అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించిన సమాచారాన్ని మాత్రం తీసుకోవచ్చు.

ప్రతి పౌరుడు విరివిగా సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని అడగండి. సమాచారం అడగడం మన హక్కు. అడిగిన సమాచారం ఇవ్వడం అధికారుల బాధ్యత. సమాచారం ఎందుకు, ఎక్కడ, ఏమిటి అని అడిగే హక్కు అధికారులకు లేదు. సహ చట్టం సెక్షన్ 26 ప్రకారం సహా చట్టాన్ని ప్రచారంలో ప్రభుత్వం కమిషన్ల బాధ్యతలు సహ చట్టం కింద సమాచారం అడిగిన వారికి సంబంధించిన అధికారి సమాచారం ఇచ్చి తీరాల్సిందే అర్టీఐఎఎస్ రాష్ట్ర అధ్యక్షులు అన్నారు.

# జనసేన యువజన విభాగం 'జై కొట్టు'

మొదటి పేజీ తరువాయి

పిఠాపురం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం పిఠాపురంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ యువజన విభాగం 'జై కొట్టు' లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యకర్తలకు ఆడియో సందేశం ఇచ్చారు.

మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. "చెయ్యెత్తి జై కొట్టు' నినాదం మనందరినీ ఎంతో కదిలిస్తుంది. ఆ స్ఫూర్తిని మీకు అందించాలనే అధినేత పవన్ ఈ లోగో పెట్టారు. జై కొట్టు నినాదంతో ముందుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేశాం. అరుపులు.. కేకలు కాదు.. క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. అధినేత ఆదేశాలను జనసైనికులు క్రమశిక్షణతో పాటించాలి" అని సూచించారు.

# ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర

## కావడం ఖాయం: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

### వచ్చే ఏడాదికి సింహాద్రి అప్పన్న చెంతకు గోదావరి జలాలు..

"అనకాపల్లి బెల్లమంత తియ్యగా ఈరోజు ఎప్పటికీ గుర్తుంటుంది. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. నిండు మనసుతో దీవెన ఫలితంగానే అనకాపల్లికి గోదారమ్మ వచ్చింది. వెలిగొండతో కృష్ణమ్మను తరలించి మార్కాపురం జిల్లాకు నీళ్లిచ్చాం. తూర్పు కనుమలు, అడవులు, నదులు, హైవేలను దాటుకుని ఉత్తరాంధ్రకు గోదావరి వచ్చింది. వచ్చే ఏడాది నాటికి సింహాద్రి అప్పన్న, అరసవెల్లి సూర్యనారాయణ స్వామిచెంతకూ గోదావరి జలాలు తీసుకెళ్తాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీళ్లిచ్చి జలహారతితో తెలుగుతల్లి రుణం తీర్చుకుంటాం. గలగలా గోదావరి, బిరబిరా కృష్ణమ్మ పరుగులతో రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తాం. ఈ జల విజయం.. ప్రజల విజయం. జలం ఉంటే జీవం.. జీవితం. గంగమ్మ ఉంటేనే పరిశ్రమలు, ఉపాధి, భద్రత, భవిష్యత్తు.

### గొడ్డలి పార్టీతో పోలవరానికి శాపం

2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడం పోలవరానికి శాపమైంది. 2024లో ప్రజలు కూటమిని గెలిపించి పోలవరానికి శాపవిముక్తి చేశారు. గొడ్డలి పార్టీ విపక్షంలోనూ విషం కక్కుతోంది. విశాఖ రాజధాని అని మాయమాటలు చెప్పారు.. మావిగన్ అని మాట మార్చారు. సరిగా పనిచేయకపోతే కఠిన చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను హెచ్చరించా. గోదావరి, కృష్ణా నదులతో ప్రజలకు మంచి జరగాలనేది నా జీవితాశయం. కాలువలో ప్రవహిస్తున్న ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం, ప్రభుత్వం సమర్థత ఉన్నాయి.

ఎడమ కాలువను విస్తరించి ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానిస్తాం. 2028 నాటికి 12 ప్రాజెక్టులు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. అందరూ అసూయపడేలా అనకాపల్లి జిల్లా అభివృద్ధి చెంది మరో రంగారెడ్డి అవుతుంది. రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్రకే వలస వచ్చే విధంగా మారుతుంది. ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర, ఉన్నతాంధ్ర కావడం ఖాయం. విశాఖకు ఐదు డేటా సెంటర్లు వస్తే ఐదు టీఎంసీల నీళ్లు కావాలి. 500 టీఎంసీలు తెచ్చే శక్తి మనకు ఉంది"అని చంద్రబాబు అన్నారు.

# నాపై ఎవరు ఆరోపణలు చేయించారో తెలుసు: మంత్రి కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి

దిల్లీ: తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కాంగ్రెస్ పెద్దలను కోరినట్లు తెలంగాణ మంత్రి కొండా సురేఖ (ఖశీఅఖు ూబతీవఎష్టు) తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చినట్లు చెప్పారు. నా వ్యవహారంపై పార్టీలో చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదన్నారు. దిల్లీలో మీడియాతో కొండా సురేఖ మాట్లాడారు.

"కాంగ్రెస్ అధిష్ఠానానికి నేను చెప్పుకోవాల్సిందంతా చెప్పాను. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారు. నా బిడ్డ స్వతంత్రంగా ఉంది. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నాను. ఆమె జీవితం ఆమె ఇష్టం. నాతో పాటు నా భర్త రాజకీయ జీవితం మా ఇష్టం. నేను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నాను. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నా. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నాను. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరాను.

### నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు..

నా బిడ్డ వ్యాఖ్యలపై నేను స్పందించను. సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. రోజూ ఎంతో మంది మాట్లాడతారు.. అందులో సుస్మిత కూడా ఒకరు. నా బిడ్డ కాబట్టి నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు. ఆమె వ్యాఖ్యలను ఖండించడం, సమర్థించడం చేయను. నా వివరణను మీనాక్షి నటరాజన్‌కు చెప్పాను. అధిష్ఠానానికి ఆమె చెప్తానన్నారు. పార్టీలో కొందరితో నాపై ఆరోపణలు చేయించారు. ఎవరు అలా చేయించారో తెలుసు. పేర్లు చెబితే వివాదం అవుతుంది. నాపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. పార్టీ ఆ దిశగానూ ఆలోచించాలి. నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు. ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నా.. అందుకే ఇక్కడికి వచ్చి నా బాధ చెప్పుకొన్నా. రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చా. పార్టీ తీసుకునే నిర్ణయం బట్టి నా ఆలోచన ఉంటుంది" అని కొండా సురేఖ అన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

"కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కాదు.. ఇది పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 4.50లక్షల కోట్ల అప్పులు చేసింది. కాంగ్రెస్ అసమర్థత ప్రొ మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసింది. రూ.50వేల కోట్లు రుణమాఫీ చేస్తామని.. రూ.20వేల కోట్లు చేశారు. రుణమాఫీ చేస్తామని.. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారు. మాఫీ చేయకుండానే.. 70శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే.. కాంగ్రెస్ నాశనం చేసింది. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు.

దిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు..

కాంగ్రెస్ పాలనలో దిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం. కాళేశ్వరం మీద కక్షకట్టి.. రైతులను శిక్షిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు. కానీ, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ పేరిట.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. దిల్లీలో రాహుల్ జెన్ జీని వెంటపెట్టుకొని.. ప్రజాస్వామ్యమని కొటేషన్లు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయి" అని విమర్శించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

# అయోధ్య రామాలయ తొలి సీఈవోగా జితేంద్ర మిశ్ర

మొదటి పేజీ తరువాయి

అయోధ్య: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ తొలి సీఈవోగా విశ్రాంత ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్ర ఎంపికయ్యారు. ఆయన దాదాపు 39 ఏళ్లపాటు వాయుసేనలో సేవలందించారు. సీఈవో పోస్టు కోసం ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ 5,585 దరఖాస్తులను పరిశీలించింది. 16 మందిని ఇంటర్వ్యూ చేసింది. ముగ్గురి పేర్లతో కూడిన తుది జాబితాను శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు అందజేయగా.. బుధవారం సమావేశమైన ట్రస్టు సభ్యులు జితేంద్ర మిశ్ర పేరును ఖరారు చేశారు. మరోవైపు.. ట్రస్టు నూతన ప్రధాన కార్యదర్శిగా గోవింద్ దేవ్ గిరి ఎంపికయ్యారు. మదన్‌మోహన్ పాండే (అయోధ్య), మహేశ్ భాగ్‌చంద్కా (దిల్లీ), డా.నిర్మలా యాదవ్ (శికోహాబాద్)లు కొత్త ట్రస్టీలుగా నియమితులయ్యారు.

విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో అయోధ్య రామాలయంలో పరిపాలన, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణను బలోపేతం చేసేందుకు ట్రస్టు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సీఈవో నియామకం చేపట్టింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జితేంద్ర మిశ్ర 1986లో భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా చేరారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు నాయకత్వం వహించారు. ఆ సమయంలో అందించిన సేవలకుగానూ యుద్ధసేవా పతకం పొందారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. ఆయన పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెస్ట్ పైలట్స్ స్కూల్ పూర్వవిద్యార్థి.

# బెంగళూరు ట్రాఫిక్ కష్టాలు.. కర్ణుడికీ తప్పలేదట!

మొదటి పేజీ తరువాయి

బెంగళూరులో 'వర్క్‌ఫ్రమ్ ఆఫీస్' అనే కంటే 'వర్క్ ఫ్రమ్ ట్రాఫిక్' అనడం సమంజసం అంటూ కొందరు సెటైర్లు వేస్తుంటారు. గూగుల్ మ్యాప్స్‌నకు సైతం మెంటలెక్కించడం బెంగళూరు రోడ్ల స్పెషాలిటీ అంటూ మీమ్స్ వేస్తుంటారు. ప్రభుత్వాలు మారినా.. పెరుగుతోన్న జనాభా, వాహన విస్ఫోటం వల్ల ట్రాఫిక్ కష్టాలు నగర వాసులను ఏళ్లుగా వెంటాడుతున్నాయి. గతంలో కిరణ్ మజుందార్ షా, మోహన్‌దాస్ పాయ్ వంటి ప్రముఖులే రహదారుల దుస్థితిపై గళమెత్తారు. ప్రభుత్వం కూడా చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో బెంగళూరు రోడ్లపై ఓ ఫన్నీ జోక్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. పూర్వం రోజుల్లో కర్ణుడికీ ట్రాఫిక్ కష్టాలు తప్పలేదని, నేటి కష్టాలకు ఆయన శాపమూ కారణమని ఎవరో ఓ సెటైరిక్ పోస్ట్ క్రియేట్ చేశారు.

వైరల్ అవుతున్న సోషల్‌మీడియా పోస్టు ఇదీ

ఈ విషయం కొందరికే తెలుసు!

కర్ణ- అర్జునుడి మధ్య చోళ రాజ్యానికి సమీపంలో.. అంటే సరిగ్గా నేటి బెంగళూరు పరిసరాల్లో చారిత్రక యుద్ధం జరిగింది.

ఆ ఉదయం కర్ణుడు "ఈరోజు సూర్యాస్తమయంలోపు ఎట్టిపరిస్థితుల్లో అర్జునుడిని మట్టికరిపిస్తా!" అని శపథం చేశాడు.

ఆత్మవిశ్వాసంతో కర్ణుడు రథం ఎక్కాడు. గుర్రాలు సైతం ఫార్ములా-1 రేసుకు సిద్ధమైనట్టు రెడీ అయ్యాయి.

అర్జునుడు కూడా ఎంతో దూరంలో లేడు. (ఇప్పటి లెక్కల్లో అయితే రెండు జంక్షన్ల అవల) కర్ణుడు మీసాలు మెలేస్తూ.. "క్షణాల్లో అక్కడికి చేరుకుంటా. అర్జునుడిని ఓడిస్తా" అంటూ బయల్దేరాడు.

బయల్దేరే సమయంలో పాపం కర్ణుడికి తెలీదు. ఇవి బెంగళూరు రోడ్లు అని. ట్రాఫిక్‌కు నిలయమని!!

అప్పటికే బయల్దేరి చాలా సేపైంది. రథం కొంచెం కూడా కదల్లేదు. 'ఇదేంటి శల్యా' అంటూ కర్ణుడు బిగ్గరగా అరిచాడు.

"మహారాజా! ఇది పీక్ అవర్. ఈ టైంలో ఇటువైపు రావడానికి దేవుళ్లు కూడా భయపడతారు" అంటూ శల్యుడి నుంచి సమాధానం.

ఓ వైపు మెట్రో పనులు. మరోవైపు సర్వీసు రోడ్లలో అడ్డుగా ఆవులు. ఇంకెంతసేపో చూద్దామంటే.. ప్రతి రెండు నిమిషాలకీ గూగుల్ మ్యాప్స్‌లో 'రీకాలిక్యులేటింగ్' అంటూ సమయం పెరిగిపోతోంది.

కర్ణుడికి అసహనం పెరిగిపోతోంది. ఓ వైపు సూర్యాస్తమయం అవుతోంది. అల్లంత దూరంలో అర్జునుడు ఫిల్టర్ కాఫీ తాగుతూ, రీల్స్ చూస్తూ కనిపిస్తున్నాడు. కాసేపట్లో చేరుకుంటే నాదే అనుకుంటూ కర్ణుడు వేగంగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు.

సరిగ్గా అప్పుడే 'ధడేల్'మంటూ శబ్దం. చూస్తే రథం చక్రం రోడ్డుపై ఉన్న భారీ గుంతలో కూరుకుపోయింది. ఎంత ప్రయత్నించినా పైకి రాలేదు. కర్ణుడికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆక్రోశంతో ఆకాశం వైపు చూస్తూ "ఈ నేలపై ఏ చక్రం కూడా సాఫీగా తిరగకూడదు గాక" అని శపించాడు.

అలా కర్ణుడు ఎక్కడైతే అటకాయించబడ్డాడో (ఇరుక్కుపోయాడో).. ఆ ప్రాంతమే కాలక్రమేణా 'కర్ణ-అటక' (కర్ణాటక)గా మారింది!

# కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు: మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి




"రైతే రాజుగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోంది. వరి వేస్తే ఉరేనని ఆనాటి దొర అన్నారు. మా ప్రభుత్వం రాగానే ఆ పంటకు బోనస్ ఇస్తున్నాం. వరి సాగులో దేశంలోనే ప్రథమ స్థానం సాధించాం. గత ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరించింది. గ్రూప్-1 ప్రశ్నపత్రాలను అమ్ముకున్నారు. మా ప్రభుత్వం రాగానే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. కోర్టు ద్వారా గ్రూప్-1 నియామకాలు ఆపాలని చూశారు. ఇటీవలే 10వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తున్నాం. గత ప్రభుత్వ బకాయిలు, అప్పులను చెల్లిస్తున్నాం. పేదలకు సంక్షేమ పథకాలు అందించాలనే తపనతో పనిచేస్తున్నాం.

బీఆర్ఎస్ నేతల ఉద్యోగాలను ఊడగొట్టారని ప్రజలను వారు రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వం చేసిన ఏ కార్యక్రమాన్నీ ప్రతిపక్షాలు ప్రశంసించలేదు. ఉప ఎన్నికల్లో ఎన్ని పొర్లుదండాలు పెట్టినా కాంగ్రెస్ గెలిచింది. ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. ప్రజలు అసహ్యించుకుంటున్నా ఆ పార్టీ నేతలు మారలేదు. గతంలో బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు. కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు. రాహుల్‌గాంధీని ఉద్దేశించి ఆయన సంస్కారహీనంగా మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారు. పదేళ్లపాటు పేదలకు రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలోపే కొత్తగా 15లక్షల కార్డులు ఇచ్చింది. కొత్తగా దాదాపు 3 లక్షల మంది వితంతువులు, వృద్ధులకు పింఛన్లు ఇవ్వనున్నాం" అని పొంగులేటి అన్నారు.

# సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

**జనసముద్రం న్యూస్ సెప్టెంబర్: 02 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి**



సుజాత నగర్ కార్పొరేషన్ పరిధిలో వేపలగడ్డ అబ్దుల్ కలాం కళాశాలలో పోలీసుల ఆధ్వర్యం లో విద్యార్థిని విద్యార్థులకు సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాల రూపాలు కూడా మారుతున్నాయని ముఖ్యంగా విద్యార్థులు యువత సోషల్ మీడియా ఆన్‌లైన్ సేవలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టడం నకిలీ పోలీస్ లేదా ప్రభుత్వ అధికారులుగా పరిచయం చేసుకోవడం పెట్టుబడులపై అధిక లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేయడం నకిలీ యాప్‌లు లింకుల ద్వారా డబ్బులు కాజేయడం వంటి మోసాలకు సైబర్ నెరగాళ్లు పాల్పడుతున్నారని వివరించారు ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలు ఫోటోలు వీడియోలు పాస్‌వర్డ్‌లు ఓటిపిలు తదితర సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్ చేయడం వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వల్ల ఫొటో మార్ఫింగ్ ఆన్‌లైన్ వేధింపులు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలియజేశారు

అదేవిధంగా సినిమాల్లో కనిపించే ప్రతి విషయాన్ని అనుకరించకుండా మంచి విషయాలను మాత్రమే స్వీకరించి చెడు ప్రభావాలకు దూరంగా ఉండాలని తెలిపారు

మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు కుటుంబాలు సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు స్నేహితుల ఒత్తిడి సరదా లేదా ఇతర కారణాలతో డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు విద్యార్థులు తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను గుర్తించి వారి ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు సాంస్కృతిక మరియు ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు క్రమశిక్షణ సామాజిక బాధ్యత వంటి మంచి విలువలను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యార్థులతో నేరుగా ఇంటరాక్ట్ అవుతూ ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానాలు అందిస్తూ సైబర్ నేరాలు సోషల్ మీడియా డ్రగ్స్ పోక్సో వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై మరింత అవగాహన కల్పించారు

సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు విద్యార్థులు యువత అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలు మాదకద్రవ్యాలు అలాగే ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ సీఐ ఆర్ వెంకటేశ్వర్లు ఎస్సైలు రమణారెడ్డి కే కళ్యాణి జుబేదాబేగం రమాదేవి కళాశాల యాజమాన్యం అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

# నిషేధిత గంజాయిని కారులో తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అశ్వాపురం పోలీసులు

**జనసముద్రం న్యూస్ సెప్టెంబర్:02 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిది**



. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా విక్రయాలు వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు

ఈ క్రమంలో 01.09.2026న ఒడిశా రాష్ట్రంలోని కలిమెల నుంచి భద్రాచలం మణుగూరు ఏటూరునాగారం మీదుగా షిర్డీకి టాటా నెక్సాన్ కారులో భార్యాభర్తలు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు ఉన్నతాధికారుల అనుమతితో అశ్వాపురం ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో కలిసి గొల్లగూడెం గ్రామ శివారులోని సీతారాం కెనాల్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు ఈ సమయంలో ాణ 30 జు 0342 నంబర్ గల టాటా నెక్సాన్ కారును ఆపి తనిఖీ చేయగా కారు వెనుక డిక్కీలో అక్రమంగా తరలిస్తున్న 40 కిలోల 560 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడింది దీని విలువ సుమారు రూ. 20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు గంజాయిని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అరబిందో బిశ్వాస్ ు/శీ రతన్ బిశ్వాస్ వయస్సు 33 సంవత్సరాలు కలిమెల పోలీస్ స్టేషన్ పరిధి మల్కన్‌గిరి జిల్లా ఒడిశా రాష్ట్రం

సుప్రియ బిశ్వాస్ వయస్సు 26 సంవత్సరాలు అరబిందో బిశ్వాస్ భార్య

విచారణలో వారు కలిమెలలోని సాలబాగ్ గ్రామానికి చెందిన హరిశ్చంద్ర మిస్త్రీ సుశాంత్ మండల్ అనే ఇద్దరి వద్ద నుంచి గంజాయిని తీసుకుని షిర్డీలోని రోహిత్ యాబిన్ అనే వ్యక్తికి సరఫరా చేసేందుకు వెళుతున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు

ఈ ఘటనపై అశ్వాపురం ఎస్ఐ రాజేష్ ఫిర్యాదు మేరకు అశ్వాపురం ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు గంజాయి అక్రమ రవాణా వెనుక ఉన్న వ్యక్తులు సరఫరా నెట్‌వర్క్‌పై కూడా దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు

ఈ సందర్భంగా మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా విక్రయాలు వినియోగానికి పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా విక్రయాలు వినియోగానికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు ప్రజలు అందించే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు

# అసెంబ్లీకి రాని కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి.

- **కరకగూడెంలో కాంగ్రెస్ బైక్ ర్యాలీ.. మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్.**
- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**

**కరకగూడెం, సెప్టెంబర్ 2 (జనసముద్రం న్యూస్):**



అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ప్రజా సమస్యలను ప్రస్తావించని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కరకగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ--డీసీసీ అధ్యక్షుల పిలుపు మేరకు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాలతో కరకగూడెం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ కార్యాలయం నుంచి పెట్రోల్ బంక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్--రాజీవ్ సెంటర్‌లో కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న కేసీఆర్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై గళం వినిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. జీతం, భద్రత, వాహనాలు తదితర సౌకర్యాలకు ప్రజాధనం ఖర్చవుతున్నప్పటికీ ప్రజల సమస్యల కోసం అసెంబ్లీకి రాకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.కేసీఆర్ పాలనలో ఇచ్చిన అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించిన ఆయన.. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను స్వీకరిస్తూ ప్రజాపాలన కొనసాగిస్తోందని తెలిపారు.కేసీఆర్‌కు ప్రజలపై నిజమైన బాధ్యత ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఇక్బాల్ హుస్సేన్ మరోసారి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్

**ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు**

**జన సముద్రం ప్రతినిధి పి శ్రీనివాస్.**



మరపురాని మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను బుధవారం ఆమనగల్లులో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజల గుండెల్లో వైఎస్సార్‌కు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన ఆశయాలను కొనసాగించడమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, సీనియర్ నాయకులు దావా ధనుంజయ, కొండల్‌రెడ్డి, దాస్ నాయక్ కాలే మల్లయ్య, ఖాదర్ ఖాద్రి, గాజుల శ్రీను, ఆదివాసీ రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్, శేఖర్ రెడ్డి ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, నాయకులు బాబా, అండేకర్ రాజు, రహీం, కరీం, మల్లేష్ నాయక్ వస్పుల శ్రీకాంత్, ఎండీ ఫరీద్, దేవరశెట్టి మహేష్, శ్రీధర్ నాయక్, గోపాల్ నాయక్, నాజర్, మహేష్, దుద్దు కృష్ణయాదవ్, బొబ్బిలి, హరిలాల్, పూసల పరమేష్, అంజాత్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయాల కోసం పనిచేస్తాం.. కార్యకర్తలకు అన్యాయం జరిగితే పోరాడుతాం

- **రాబోయేది రాజశేఖర్ రెడ్డి యుగమే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**జన సముద్రం న్యూస్ నార్కెట్‌పల్లి నల్లగొండ సెప్టెంబర్ 2**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన సొంత గ్రామమైన నార్కెట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంలలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి గౌరవ మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి నకిరేకల్ మునుగోడు నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు వైఎస్సార్ అభిమానులు హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా ఎలా నిలవాలో ప్రజా నాయకుడు ఎలా ఉండాలో స్ఫూర్తి నింపిన మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు.పేద ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్నారంటే అందుకు వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాలే కారణమన్నారు రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు పేదలు రైతుల సంక్షేమం కోసం వైఎస్సార్ తీసుకొచ్చిన అనేక పథకాలు దేశ చరిత్రలో నిలిచిపోయాయని పేర్కొన్నారు.ఈ ప్రాంతంలో కరువు ఫ్లోరైడ్ సమస్యలను దూరం చేయడానికి ఉదయ సముద్రం ప్రాజెక్టును తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌దేనని అన్నారు గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉదయ సముద్రం ప్రాజెక్టును పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించామని తెలిపారు వైఎస్సార్ ఆశయాల సాధన కోసం నిరంతరం పనిచేస్తామని ఆయన మాట ఇస్తే మడమ తిప్పని నాయకుడని తాము కూడా అదే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నామని రాజగోపాల్ రెడ్డి అన్నారు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నుంచి నాయకులను పార్టీలోకి ఆహ్వానించడం మంచిదేనని అయితే కాంగ్రెస్‌లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు.మా ఇంట్లోకి వచ్చి మమ్మల్నే బయటకు పంపిస్తామంటే ఊరుకోమని నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరిగితే వారి తరఫున రాజగోపాల్ రెడ్డి పోరాడుతాడని రాబోయేది రాజశేఖర్ రెడ్డి యుగమేనని అన్నారు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేత

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిది శ్రీకాంత్ గుప్తా (సెప్టెంబర్ 2)**



దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ మందమల్లమ్మ చౌరస్తా వద్ద ఘనంగా నివాళులర్పించారు.

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి కుమారుడు, యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళల సంక్షేమం కోసం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా సామాన్య ప్రజలకు వైఎస్సార్ అండగా నిలిచారని కొనియాడారు.

ప్రజా సంక్షేమం, రైతుల అభ్యున్నతి, పేదల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు ఎప్పటికీ ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిపోతాయని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ మాజీ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి, నాయకులు రామిడి రామిరెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, మాదారి రమేష్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, లప్ప లక్ష్మణ్ తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు నివాళులర్పించారు

# డాక్టర్ బాసని సురేష్‌ను వరించిన జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారం

**హనుమకొండ సెప్టెంబర్ 02(జనసముద్రం)**



జానపద సాహిత్య పరిషత్తు అత్యంత ప్రతిష్టాత్మకంగా అందించే డాక్టర్ చింతపల్లి వసుంధరారెడ్డి జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారం డాక్టర్ బాసని సురేష్‌కు ప్రదానం చేశారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్‌లోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు.బుధవారం హైదరాబాద్ కూకట్‌పల్లిలోని కృష్ణ సింధూరి సంకల్ప లలిత కళా నిలయంలో జానపద సాహిత్య పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ చింతపల్లి వసుంధరారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యఅతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఆత్మీయ అతిథిగా పమిడి కాల్వ మధుసూదన్ హాజరై డాక్టర్ బాసని సురేష్‌కు పురస్కారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా తెలుగు అకాడమీ డైరెక్టర్ ఆచార్య భట్టు రమేష్, కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు పాకనాటి జ్యోతి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న, జూనియర్ అసిస్టెంట్ ఆమేర్ అలీ ఖాన్, అధ్యాపకులు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, బుక్ బేరర్ సిద్ధోజు సునంద తదితరులు డాక్టర్ బాసని సురేష్‌ను అభినందించారు.

# రాజన్నపేట పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ

**జనసముద్రం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2**



ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట ఎంపీ యూపీఎస్ పాఠశాలలో బుధవారం విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. విద్యార్థులందరూ సమానత్వ భావనతో పాఠశాలకు హాజరై, క్రమశిక్షణతో విద్యను అభ్యసించేందుకు యూనిఫామ్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంజుల, గ్రామ సర్పంచ్ కల్లూరి బాపురెడ్డి, ఉప సర్పంచ్ ఉడుగుల యాదగిరి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ శంకర్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ఉపాధ్యాయులు ప్రవీణ్ రావు విజయలక్ష్మి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# మెట్‌పల్లి జువ్వాడి భవన్‌లో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు

**జనసముద్రం న్యూస్ ప్రతినిధి -- మెట్‌పల్లి:**

ముక్కెర సతీష్ కుమార్ (ఎడిటర్)



మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మెట్‌పల్లిలోని జువ్వాడి భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లిజువ్వాడి కృష్ణారావు గారు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ సేవాదళ అధ్యక్షుడు లిలినాయని సురేశ్ గౌడ్, మెట్‌పల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు వైఎస్ఆర్ ప్రజలకు అందించిన సేవలను స్మరించుకున్నారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్ఆర్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2, 2026:**





ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల సామాజిక ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఆసుపత్రి ప్రహరీ గోడ నిర్మాణం, రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని తెలిపారు. ఆసుపత్రి ప్రహరీ గోడను అనుకొని ఏర్పాటుచేసిన టేలాను వెంటనే తొలగించాలని, అనుమతి లేకుండా టేలా ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెన్నూర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ తో కలిసి సందర్శించి పాఠశాలలోని సిబ్బంది హాజరు పట్టిక, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని తెలిపారు. పాఠశాలలో విద్యారుల సంఖ్య పెంపొందించాలని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఒక వాట్సాప్ గ్రూప్ తయారుచేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, గైర్హాజరు, ఇతర సంబంధిత అంశాలను ప్రతిరోజు అందించాలని తెలిపారు. మండలంలోని కత్తరశాల గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, ఓటర్లు సమర్పించిన వివరాల పరిశీలన అంశాలను పరిశీలించారు. మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు అందించిన నోటీసులకు సంబంధించి వారు సమర్పించిన ధృవపత్రాలను పరిశీలించి భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకొని ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామంలో నిర్మిస్తున్న వి.ఓ. భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామంలో నెలకొన్న ఇసుక కొరత సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండలంలోని సోమనపల్లిలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, విద్యా సౌకర్యాలు అందేలా పనులను చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న సీఐ పులి రమేశ్‌కు ఆత్మీయ వీడ్కోలు

**•నూతన సీఐ కే. శ్రీనివాస్‌కు ఘన స్వాగతం**

**ఎల్కతుర్తి సెప్టెంబర్ 2(జనసముద్రం)**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సీఐ పులి రమేశ్‌కు బుధవారం పోలీసు సిబ్బంది, పత్రికా విలేకరులు, ప్రజాప్రతినిధులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అదే సమయంలో నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కే. శ్రీనివాస్‌కు సిబ్బంది సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పులి రమేశ్, కే. శ్రీనివాస్ పరస్పరం స్వీట్లు తినిపించుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరినొకరు అభినందించుకుంటూ హ్యాండ్‌షేక్ చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో బదిలీలు సహజమేనని, ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని వారు పేర్కొన్నారు.

**పులి రమేశ్‌కు ఆత్మీయ వీడ్కోలు :**

ఎల్కతుర్తి సర్కిల్‌లో సీఐ పులి రమేశ్ అందించిన సేవలను పోలీసు సిబ్బంది గుర్తు చేసుకున్నారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. భవిష్యత్ విధుల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

**నూతన సీఐ కే. శ్రీనివాస్‌కు స్వాగతం :**

నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కే. శ్రీనివాస్‌కు పోలీసు సిబ్బంది సాదర స్వాగతం పలికారు. విధుల నిర్వహణలో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పులి రమేశ్, కే. శ్రీనివాస్ మధ్య కనిపించిన ఆత్మీయత, స్నేహపూర్వక వాతావరణం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పత్రికా విలేకరులు, ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి

**•మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2, 2026:**





ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండలంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ, విద్యా కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. చిత్తాపూర్ గ్రామపంచాయతీలో నిర్మాణంలో ఉన్న వి.ఓ. భవన నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న సేవలను పరిశీలించి, మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. బేస్‌లైన్ పరీక్షల ఫలితాలను పరిశీలించి, విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధనా ప్రణాళికలు రూపొందించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామపంచాయతీలో ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ, ఫారాల స్వీకరణ, వివరాల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. అవసరమైన పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో పంట కుంట నిర్మాణ పనులను పరిశీలించి, గ్రామస్థులతో మాట్లాడి పంట కుంట వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వర్షపు నీటిని సంరక్షించుకోవడంతో పాటు వ్యవసాయ అవసరాలకు నీటి లభ్యత పెంచుకునేందుకు సమన్వయంతో కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నెన్నెల మండల సమాఖ్య ఆధ్వర్యంలోని యూనిఫాం కుట్టు కేంద్రాలను సందర్శించి యూనిఫాం కుట్టు పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతతో పాటు నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసి విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న సివిల్ పనులను పరిశీలించారు. మిగిలిన పనులను వేగవంతం చేయాలని, విద్యుత్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీర్‌ను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, విద్యార్థుల హాజరు, ఎఫ్.ఆర్.ఎస్. హాజరు నమోదు, ఆపార్ ఎంట్రీ తదితర అంశాలపై సమీక్షించారు. విద్యార్థుల వివరాల నమోదులో ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ఏపీవో, ఏపీఎం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వరావుపేట లో ఘనంగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట**



గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని వైస్ చైర్ పర్సన్ జూపల్లి రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, వృద్ధులు తదితర అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్‌ది ప్రజల మనసులను గెలుచుకున్న వ్యక్తిత్వమని, పేదల కష్టాలను దగ్గరగా అర్థం చేసుకుని వారికి అండగా నిలిచిన నాయకుడని వారు పేర్కొన్నారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లి, వారి కష్టాలను స్వయంగా తెలుసుకున్న నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, తుమ్మ రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, వార్డు కౌన్సిలర్స్ మిశీడా హరిబాబు, చిన్నంశెట్టి శ్రీనివాసరావు, తిరుమల శెట్టి వెంకన్న బాబు, జీనుగు రవి. బూసి పాండురంగారావు, బండారు మహేష్, కానూరి మోహన్ రావు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సూరారం గ్రామానికి బస్సు సౌకర్యం.. ప్రజల్లో హర్షం

**ఎల్కతుర్తి సెప్టెంబర్ 02(జనసముద్రం)**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలన్న గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. గ్రామానికి బస్సు సర్వీస్ మంజూరు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించిన నేపథ్యంలో బుధవారం సూరారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బచ్చు శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో గ్రామ ప్రజల ప్రతినిధులు ఆర్టీసీ లోకల్ బస్ మేనేజర్ ధర్మసింగ్‌ను కలిసి అధికారికంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్ మేనేజర్ ధర్మసింగ్ మాట్లాడుతూ సూరారం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొన్ని రోజుల్లోనే గ్రామ ప్రజలకు బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. సూరారం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ మంజూరు కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. బస్సు సర్వీస్ ప్రారంభమైతే మండల కేంద్రానికి రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, వృద్ధులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఎల్కతుర్తిలో ఘనంగా

**ఎల్కతుర్తి సెప్టెంబర్ 2 (జనసముద్రం)**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్ వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు. వైఎస్సార్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, సీనియర్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎల్కతుర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్, మంద సుమన్, ఏఎంసీ డైరెక్టర్ గొడిశాల రాజయ్య, పాక రమేష్, మాజీ సర్పంచులు గొడిశాల యాదగిరిగౌడ్, రాజిరెడ్డి, ఎల్కతుర్తి మండల గౌడ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, డాక్టర్ బొల్లిపోగు రమేష్ బాబు, ఎర్రోళ్ల జీవన్, ఎర్రోళ్ల సతీష్, వీరప్ప, శ్రీపతి సదానందం, అర్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ధూప దీప నైవేద్య అర్చకుల గౌరవభృతి రూ.25 వేలకు పెంచే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా: డిప్యూటీ స్పీకర్





**•అర్చకుల హక్కుల కోసం పోరాటం కొనసాగాలి: గంగు ఉపేందర్ శర్మ**

**హనుమకొండ సెప్టెంబర్ 2(జనసముద్రం)**

రవీంద్రభారతిలో బంజారా ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ, మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి వి.హనుమంతరావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ, బంజారా సంఘం రాష్ట్ర నాయకుడు రాములు నాయక్, తెలంగాణ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ డా. రామచంద్ర నాయక్, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బంజారా సంఘం నాయకులు, సేవాలాల్ సమితి రాష్ట్ర నాయకులు జయరాం స్వామీజీ, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్, బంజారా ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయరాం గురుస్వామి, బాలు నాయక్, లచ్చిరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. సుమారు వెయ్యి మంది గిరిజనులు, గిరిజన పూజారులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ మాట్లాడుతూ.. 2007లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి దేవాదాయ శాఖ చట్టానికి సవరణ చేసి, 2008లో ధూప దీప నైవేద్య పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. తెలంగాణ అర్చక సమాఖ్య పోరాటాల ఫలితంగా ప్రారంభమైన ఈ పథకం తొలుత రూ. 2,500 గౌరవభృతితో ప్రారంభమైందన్నారు. తదనంతరం అర్చక సమాఖ్య విజ్ఞప్తుల మేరకు గౌరవభృతి పెంపుదలకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ధూప దీప నైవేద్య అర్చకులకు అర్చక వెల్ఫేర్ బోర్డులో స్థానం కల్పించడం ద్వారా సంక్షేమ కార్యక్రమాలకు అవకాశం ఏర్పడిందన్నారు. అర్చకులకు అనివార్య పరిస్థితుల్లో మరణం సంభవించినప్పుడు వెల్ఫేర్ బోర్డు ద్వారా రూ. 4 లక్షల గ్రాట్యుటీ అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకర్ డా. రామచంద్ర నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ధూప దీప నైవేద్య అర్చకులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన పూజారులు సేవాలాల్ స్ఫూర్తితో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల ద్వారా ఆధ్యాత్మిక భావనను పెంపొందించాలని సూచించారు. ధూప దీప నైవేద్య అర్చకుల గౌరవభృతిని రూ. 25 వేలకు పెంచే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్ తెలిపారు. గిరిజన పూజారుల సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన పూజారులు, బంజారా సంఘాల ప్రతినిధులు, అర్చక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడిగా రామగిరి రామన్న,

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2:**



మంచిర్యాల జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడిగా జైపూర్ మండలం పెగడపల్లి సర్పంచ్ రామగిరి రామన్న ను, ఎన్నుకున్నట్టు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి తెలిపారు, మంచిర్యాల జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు మంచిర్యాల జిల్లాలోని ప్రతి సర్పంచికి కృతజ్ఞత తెలియజేస్తున్నట్టు, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటానని ఈ సందర్భంగా పెగడపల్లి సర్పంచ్ రామగిరి రామన్న తెలియజేశారు

# ప్రతిభ ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగింపు,

**•మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య,**

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2, 2026:**

జాతీయ ఆదాయ ఆధారిత ప్రతిభా ఉపకార వేతన పథకం క్రింద 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్ష దరఖాస్తు గడువు పొడిగించడం జరిగిందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని మోడల్ పాఠశాలలలో 2026--27 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న



విద్యార్థులు ఈ నెల 5వ తేదీ లోగా ఆన్‌లైన్ లో ఫ్రైజూ/ఎంవ్.వశ్రీఖఅస్తుఋఖ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ నెల 8వ తేదీలోగా జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఆన్‌లైన్ అప్లికేషన్ల హార్డ్ కాపీలను అందజేయాలని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎక్కువ మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జనరల్ / బి.సి. విద్యార్థులు 100 రూపాయలు, ఎస్.సి., ఎస్.టి., దివ్యాంగ విద్యార్థులు 50 రూపాయలు ఆన్లైన్ లో రుసుము చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

నవంబర్ 2025లో ఈ పథకం క్రింద ఎంపిక కాబడి ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు నూతనంగా, గతంలో ఎంపిక కాబడి ప్రస్తుతం 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు రెన్యువల్ కొరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించడం జరిగిందని తెలిపారు. ఆన్ లైన్ లో చేసిన దరఖాస్తులను పాఠశాల స్థాయి నోడల్ అధికారి అక్టోబర్ 15వ తేదీలోగా ఆన్ లైన్ లో పరిశీలించి జిల్లా విద్యాధికారి కార్యాలయంలో హార్డ్ కాపీ అందించాలని తెలిపారు.

అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# అగ్రికల్చర్ కాలేజీలో సైబర్ నేరాల అవగాహన సదస్సు

అశ్వారావుపేట మండలంలోని వ్యవసాయ కళాశాల నందు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్వంచ డీస్పీ శ్రీ ఆర్. సతీష్ కుమార్ హాజరై విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.

డీస్పీ మాట్లాడుతూ..ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేయడానికి కొత్త పంథాలను అనుసరిస్తున్నారని తెలిపారు.

డిజిటల్ అరెస్ట్ స్కామ్:లి పోలీసులు, సిబిఐ , జుణ అధికారులమని వీడియో కాల్ చేసి భయపెట్టి డబ్బులు వసూలు చేయడం పూర్తిగా మోసం. పోలీసులు ఎప్పుడూ ఇలా వీడియో కాల్ లో అరెస్ట్ చేయరని స్పష్టం చేశారు.

పార్ట్ టైమ్ జాబ్ మోసాలు ఇంట్లో ఉండి డబ్బులు సంపాదించవచ్చని టెలిగ్రామ్ వాట్సాప్ లలో మెసేజ్ లు పెట్టి మొదట కొంత డబ్బు ఇచ్చి నమ్మించి ఆ తర్వాత పెద్ద మొత్తంలో మోసం చేస్తున్నారని హెచ్చరించారు.

ఇన్వెస్ట్మెంట్ మోసాలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని నకిలీ ట్రేడింగ్ యాప్ ల ద్వారా మోసం చేస్తున్నారని, అధిక లాభాలు అంటే మోసమని గుర్తించాలని సూచించారు.



సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మోసాలతో ప్రజలను మోసం చేస్తున్నారని

అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దనఓటీపీ , బ్యాంక్ వివరాలు, ఆధార్ వివరాలు ఎవరికీ చెప్పవద్దన - ఆన్‌లైన్ లోన్ యాప్స్, మోసాలు, సోషల్ మీడియా బ్లాక్ మెయిలింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని

ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 కి కాల్ చేయాలని లేదా లిఘ్ఘ.సైబరక్రైమ్ .స్త్రశీజ.ఇన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్ కుమార్ గారు అలాగే అశ్వారావుపేట సీఐ పి.నాగరాజు గారు మరియు ఎస్సైలు టీ . యయాతి రాజు, దేవ్ సింగ్ లు పాల్గొని విద్యార్థులకు సైబర్ భద్రతపై పలు సూచనలు చేశారు

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పరిపాలన పై ఆరు గ్యారెంటీలు 420 హామీల అమలుపై అశ్వారావు పేటలో సమర శంఖం పూరించిన బిఆర్ఎస్ పార్టీ.

**జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 2 బ్యూరో చీఫ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా**

తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చినటువంటి ఆర్ గ్యారంటీలు 420 హామీల పై ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో అశ్వరావుపేట పట్టణంలోభారీ ర్యాలీ తో సమర శంఖారావం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలోని ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు లిఉప్పనూతల వెంకటరమణ రావు గారు మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలు అమలుకు నోచుకోలేదని ప్రజలకు ఇచ్చిన



హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది

ఈ భారీ ర్యాలీలో అన్నపురెడ్డిపల్లి ఎక్స్ ఎంపీపీ శ్రీమతి సున్నం లలిత పాల్గొని పార్టీ శ్రేణులతో కలిసి ప్రజా సమస్యలపై వెయ్యి రోజుల ప్రజా పరిపాలనలో ప్రజల ఆశలు నెరవేరలేదని రైతులు మహిళలు నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పైన ప్రభుత్వం పట్టించుకోవట్లేదు అని ఆమె పేర్కొన్నారు

ఈ కార్యక్రమం అశ్వరావుపేట పట్టణంలోని ప్రధాన వీధుల గుండా వందలాది పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# యువత గంజాయికి దూరంగా ఉండాలి, జైపూర్ ఎసిపి ఆరే వెంకటేశ్వర్,

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2,2026:**

యువత గంజాయికి దూరంగా ఉండి సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని జైపూర్ ఏసిపి ఆరే వెంకటేశ్వర్ అన్నారు, బుధవారం రోజున భీమారం పోలీస్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జైపూర్ సిఐ కె. నవీన్ కుమార్, భీమారం ఎస్సై ఏ. రాజేందర్ ,తో కలిసి మాట్లాడుతూ భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి వినియోగానికి అలవాటు పడిన 10 మంది యువకులను గుర్తించి వారికి గంజాయి వినియోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు, గంజాయి వినియోగ నిర్ధారణ పరీక్షల్లో గంజాయి వినియోగించినట్లు నిర్ధారణ కావడంతో, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించి, వైద్యుల పర్యవేక్షణలో వారికి చికిత్స అందించి



గంజాయి వినియోగం వల్ల జరిగే అనర్థాలపై కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు, గంజాయి వినియోగించిన, సరఫరా చేసిన కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు, కార్యక్రమంలో జైపూర్ సిఐ కె. నవీన్ కుమార్, భీమారం ఎస్సై ఏ. రాజేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# రీ-సర్వే, ఎస్.ఐ.ఆర్, ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి, మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2, 2026:**

జిల్లాలో కొనసాగుతున్న రీ- సర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండలం ఆయెపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే పనులను కోటపల్లి మండల తహసీల్దార్ రాఘవేంద్ర తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి. రాములు, మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో చేపట్టిన రీ-సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్‌లలో వివరాలు నమోదు చేస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రీ-సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కోటపల్లి మండలం అల్గావ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో



తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ లో భాగంగా చేపట్టిన విచారణను పరిశీలించి ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అనంతరం భీమారం మండలం అంకుశాపూర్ గ్రామంలోని సమతా అగ్రో ఇండస్ట్రీస్ ను భీమారం తహసీల్దార్ సదానందం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎల్. రజిత, తో కలిసి సందర్శించి, పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ బియ్యం వివరాలను అడిగి తెలుసుకొని, సిఎంఆర్‌కు సంబంధించిన పెండింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా



చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని ప్రతిపాదిత నూతన మండల రెవెన్యూ కార్యాలయం నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. రీ-సర్వే పనులను సమీక్షించి, సర్వేకు సంబంధించిన వివరాలను ఫీల్డ్ రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు, అన్ని సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ,

**ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం.దేవేజీ,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2, 2026:**

ప్రభుత్వ వైద్య కళాశాల లో ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం.దేవేజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పంద ప్రాతిపదికన మార్చి 31, 2027 వరకు వాస్తవ అవసరం ఆగిపోయే వరకు / రెగ్యులర్ పోస్టులు భర్తీ అయ్యే వరకు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్ల పోస్టుల నియామకం కోసం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 9వ తేది ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు హాజీపూర్ మండలం గుడిపేటలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నోటిఫికేషన్, అందుబాటులో ఉన్న పోస్టుల పూర్తి వివరాలు, దరఖాస్తు ఫారమ్ కళాశాల వెబ్ సైట్ https://www.gmcmancherial.org/లో సంప్రదించాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఆంధ్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

**•చిన్నారులకు పాదరక్షలు, గ్రామస్తులకు దుప్పట్లు పంపిణి**

**అధికారులే వెళ్ళని చోట జనసేన సేవ**

జన సముద్రం న్యూస్-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. అశ్వారావుపేట మండలం చెన్నాపురం దట్టమైన అడవిలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అశ్వారావుపేట జనసేన పార్టీ అరుదైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. అధికారులు సైతం వెళ్లడానికి జంకే మారుమూల అడవి ప్రాంతమైన మండలంలోని చెన్నాపురం కాలనీలో ఆదివాసీ బిడ్డల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరిపారు.

ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు ఇస్లావత్ వినోద్ కుమార్, నియోజకవర్గ నాయకులు ముయబోయిన ఉమాదేవి ఆధ్వర్యంలో సుమారు 45 మంది చిన్న పిల్లలకు నూతన పాదరక్షలు పంపిణీ చేశారు. అంతేకాకుండా చలికి వణుకుతున్న గ్రామస్తులందరికీ దుప్పట్లు పంపిణీ చేసి అండగా



నిలిచారు. నగరాల్లో జరిగే ఆర్భాటపు వేడుకలకు భిన్నంగా అడవి బిడ్డల చిరునవ్వుల మధ్య జరిగిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది.పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా అట్టడుగున ఉన్న గిరిజనులకు సేవ చేయడమే నిజమైన పుట్టినరోజు కానుక అని మండల అధ్యక్షులు వినోద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, మల్లం రామకృష్ణ,మంగ గణేష్, గుమ్మళ్ళ పోసి బాబు, మారిన చరణ్ సాయి, కొనకళ్ళ రాజేష్, కార్యకర్తలు, పవన్ అభిమానులు పాల్గొన్నారు.

# జన్నారంలో ఘనంగా పవన్ కళ్యాణ్ 55 వ జన్మదిన వేడుకలు

**జనసముద్రం న్యూస్ ప్రతినిధి ఖానాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ శ్రావణ్ కుమార్**

సెప్టెంబర్ 2 మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన సందర్భంగా ఈరోజు జన్నారంప్రభుత్వఆసుపత్రిలో జనసేన పార్టీ నాయకులు అభిమానులు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారుఈ సందర్భంగా మూగల వెంకటేష్ మరియు పవన్ కళ్యాణ్ అభిమానులు అందరు కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో జనసేన



పార్టీ జన్నారం మండల అధ్యక్షుడు మూగల వెంకటేష్ తో పాటు జనసేన పార్టీ నాయకులు పవన్ కళ్యాణ్ అభిమానులు కొమురవెల్లి సుందుల్ స్వరాజ్ బందారి సంజీవ్ శేఖర్ సిద్ధు సుజిత్ దినేష్ తదితరులు పాల్గొన్నారు

# వైఎస్సార్ సేవలు స్ఫూర్తిదాయకం.. శ్రీనివాస్ గౌడ్ ఆశయాలే మా బాట

**•మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లకు చీరల పంపిణీ**

**మల్కాజిగిరి, జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 2:**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ 17వ వర్ధంతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీడి శ్రీనివాస్ గౌడ్ మూడో వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జీడి సంపత్ గౌడ్,



అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి వరుణ్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ పరిశీలకుడు షమీర్ కౌశల్, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం డాక్టర్ వైఎస్సార్ అందించిన సేవలను స్మరించుకున్నారు. అదేవిధంగా మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం జీడి శ్రీనివాస్ గౌడ్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. జీడి శ్రీనివాస్ గౌడ్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు, కార్మిక వర్గాలకు అండగా నిలవడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పాలిటి పెన్నిధి వైఎస్సార్

**ఫకీర్పురంలో ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి వేడుకలు**




**జన సముద్రం న్యూస్ నాంపల్లి నల్లగొండ సెప్టెంబర్ 2**

నాంపల్లి మండలం ఫకీర్పురం గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ముదిగొండ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారుఈ సందర్భంగా ముదిగొండ శ్రీకాంత్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ జలయజ్ఞం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. పేద ప్రజల ఆరోగ్యం విద్య రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు వైఎస్సార్ చూపిన సంక్షేమ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ముదిగొండ శ్రీకాంత్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్ అభిమానులు మారం వెంకట్ రెడ్డి పగిళ్ల వెంకటయ్య రమేష్ కల్లల లోహిత్ రెడ్డి రవీందర్ రెడ్డి నరేందర్ రెడ్డి యాదగిరి రెడ్డి కృష్ణారెడ్డి వినోద్ యాదగిరి ఈదమ్మ బాలమ్మ గోపమ్మ లాలయ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ 'ఆరు గ్యారెంటీలు' పచ్చి మోసం

**-దేవుడి సాక్షిగా ఒట్టేసి ప్రజలను వంచించిన కాంగ్రెస్**
**- వచ్చే నెల అన్నారు.. 100 రోజులన్నారు 1000 రోజులు కావస్తున్నా అమలు శూన్యం**
**-- ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలి**
**-- రైతులు, మహిళలు, యువతను నట్టేట ముంచిన రేవంత్ రెడ్డి సర్కార్**
**-- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 2.దేవరకొండ. జిల్లా. నల్గొండ

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలు'420 హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను తీవ్రంగా వంచించిందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ వద్ద మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్.మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, సంక్షేమ పథకాల పరిస్థితిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ అభ్యర్థులు దేవాలయాల్లో దేవుళ్ల సాక్షిగా ఒట్లు వేసి గ్యారెంటీ కార్డులు' పంపిణీ చేశారని ఆయన గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 9న అధికారంలోకి వచ్చిన మొదటి రోజే సంతకం చేసి, 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను సంపూర్ణంగా అమలు చేస్తామని ప్రజలను నమ్మించారని తెలిపారు. అయితే 100 రోజుల గడువు దాటి దాదాపు 1000 రోజులు కావస్తున్నా హామీల అమలు మాత్రం శూన్యంగా ఉందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని హామీల కారణంగా వివిధ వర్గాలకు చెల్లించాల్సిన బకాయిలను రమావత్ రవీంద్ర కుమార్ వివరించారు.మహిళలకు: 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఈ లెక్కన ఒక్కో మహిళకు రూ.82,500 బకాయి ఉందన్నారు.





కళ్యాణలక్ష్మి: పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, దేవరకొండ నియోజకవర్గంలో చెక్కులు పొందిన సుమారు 5,000 మంది ఆడబిడ్డలకు తులం బంగారం బకాయి ఉందన్నారు.మహిళా విద్యార్థినులు: అర్హులైన విద్యార్థినులకు ఉచిత స్కూటర్ల పంపిణీ హామీని గాలికొదిలేశారని విమర్శించారు.

రైతులు: ఎకరానికి రూ.15,000 రైతు భరోసా ఇస్తామని చెప్పి, పాత పథకం కింద ఇచ్చే మొత్తాన్ని కూడా సక్రమంగా ఇవ్వలేదని ఆరోపించారు. నాలుగు ఎకరాల రైతుకు రైతు భరోసా రూపంలోనే దాదాపు రూ.1,02,000 బకాయి ఉందన్నారు.పింఛన్లు: వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు ఇస్తున్న రూ.2,000 పింఛన్‌ను రూ.4,000కు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, పెంచాల్సిన రూ.2,000 చొప్పున ఒక్కో లబ్ధిదారునికి రూ.66,000 బకాయి పడిందన్నారు.

దివ్యాంగులు: రూ.6,000 పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఒక్కో దివ్యాంగుడికి రూ.66,000 బకాయి ఉందన్నారు.

రుణమాఫీ: రూ.2 లక్షల పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసం చేశారని ఆరోపించారు.ధాన్యం బోనస్: వడ్ల కొనుగోలుపై క్వింటాలుకు రూ.500 బోనస్ అన్ని రకాల ధాన్యానికి ఇస్తామని చెప్పి, ఇప్పుడు నిబంధనల పేరుతో రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు.ఎకరానికి రూ.12,500 చొప్పున గత ఆరు పంటలకు కలిపి రైతుకు రూ.75,000 వరకు బోనస్ బకాయి ఉందన్నారు.వ్యవసాయ, ఉపాధి కూలీలు: ఏడాదికి రూ.12,000 ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో రెండేళ్లకు రూ.24,000 చొప్పున బకాయి ఉందన్నారు.ఆటో డ్రైవర్లు: ఏడాదికి రూ.12,000 చొప్పున రెండేళ్లకు రూ.24,000 ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. విద్యార్థులు: రూ.5 లక్షల విద్యా భరోసా కార్డుల హామీ అమలు కాలేదని, గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగులు: నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఈ లెక్కన ఒక్కో నిరుద్యోగికి రూ.1,32,000 బకాయి పడిందన్నారు.

- ఉద్యోగాలు: రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు.రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని రమావత్ రవీంద్ర కుమార్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువత, రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్యకర్తే ముందు.. కార్యక్రమం తర్వాత

**•మానవత్వానికి మారుపేరు మైనంపల్లి ఆపదలో ఉన్న కార్యకర్త కోసం కార్యక్రమం పక్కనపెట్టి ఆసుపత్రికి పరుగులు**

మల్కాజిగిరి, జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 2:

ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తను ఆదుకోవడంలో నాయకత్వానికి మానవత్వమే నిజమైన అర్థమని మైనంపల్లి హనుమంత్‌రావు మరోసారి చాటిచెప్పారు.ఈరోజు మల్కాజిగిరి చౌరస్తాలో పార్టీ కార్యక్రమం ముగించుకుని నిజామాబాద్‌కు బయలుదేరిన మైనంపల్లి హనుమంత్‌రావు మార్గమధ్యలో మిలిటరీ డెయిరీ ఫామ్ మీదుగా వెళ్తుండగా కొంతమంది పార్టీ నాయకులు కనిపించారు. దీంతో ఆయన వెంటనే కారు ఆపించి వారి వద్దకు వెళ్లగా, కాంచన్‌బాగ్ చౌరస్తాలో పార్టీ కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న సమయంలో పార్టీ నాయకుడు సాగర్ గారికి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి కుప్పకూలారని, రష్



ఆసుపత్రికి తరలించామని వారు తెలిపారు.విషయం తెలిసిన వెంటనే మైనంపల్లి హనుమంత్‌రావు తన ప్రయాణాన్ని రద్దు చేసుకుని ఆసుపత్రి వైపు కారును మళ్లించాలని సూచించారు. రష్ ఆసుపత్రి యాజమాన్యానికి సమాచారం అందిస్తూ, సాగర్‌కు అత్యవసర వైద్యం అందేలా ఏర్పాట్లు చేయించారు. సాగర్ ఆసుపత్రికి చేరుకునేలోపే ఆయన ఎమర్జెన్సీ విభాగానికి చేరుకుని వైద్యులను అప్రమత్తం చేశారు.అప్పటికే ఆయన చిన్న కుమారుడు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద దాదాపు రెండు గంటలుగా తండ్రి కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, కార్యకర్త ప్రాణాలకు ప్రాధాన్యతనిస్తూ మైనంపల్లి హనుమంత్‌రావు ఆసుపత్రిలోనే ఉండిపోయారు.వైద్యుల బృందం చికిత్స కొనసాగిస్తూ "మేము చూసుకుంటాం, మీరు వెళ్లవచ్చు" అని చెప్పినప్పటికీ, సాగర్ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా స్థిరపడే వరకు తాను వెళ్లనని ఆయన స్పష్టం చేశారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం సాగర్ ప్రమాదం నుంచి బయటపడ్డారని వైద్యులు ధృవీకరించడంతో మైనంపల్లి హనుమంత్‌రావు ఊపిరి పీల్చుకున్నారు.అంతేకాకుండా సాగర్ కుటుంబ సభ్యుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోవద్దని, ఆసుపత్రి బిల్లు మొత్తం తానే భరిస్తానని ఆసుపత్రి యాజమాన్యానికి తెలిపారు. అనంతరం సాగర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అక్కడి నుంచి బయలుదేరారు."పార్టీ కార్యకర్త కష్టంలో ఉంటే కార్యక్రమాలు, ప్రయాణాలు అన్నీ తర్వాతే. మనిషి ప్రాణం, అతని కుటుంబం ముఖ్యం" అనే విధంగా వ్యవహరించిన మైనంపల్లి హనుమంత్‌రావు తీరుపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.


ప్రజల కోసం, కార్యకర్తల కోసం, కుటుంబాల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం, సమాజం కోసం అండగా నిలిచే నాయకత్వం అవసరమని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

## బిఆర్ఎస్ పార్టీ, ఇచ్చిన పిలుపు మేరకు, కాంగ్రెస్ పార్టీ,1000 రోజుల ప్రజా వ్యతిరేక పాలనపై నిరసనగా భద్రాచలంలో భారీ ర్యాలీ నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ.

జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 2 బ్యూరో చీఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

**కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో**

,ప్రజల కు ఇచ్చిన, 6 గారంటీ లు, 420, మోసపూ రిత హామీలు, వెంటనే అమలు చేయాలని, కోరుతూబుధవారం భద్రాచలం లో బి ఆర్ ఎస్ పార్టీ భారీ ర్యాలీతో నిరసన తెలిపారు. దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం,మండ లాల నుండి, వందల సంఖ్యలో మోటారు సైకిల్స్ తో, బి ఆర్.ఎస్. పార్టీ కేడర్ భద్రాచలం, పురవీదులల్లో, ర్యాలీనిర్వహించి, ప్రజల కు, కాంగ్రెస్ పార్టీ, మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చి హామీలను అమలు చేయడం లేదని నిఎండ కట్టటం తో పాటుగా, గతంలో కెసిఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభి వృద్ధి, పథకాలగురించి, ప్రజలకు సవివరరం గాతెలియజేయటం జరిగింది, ఈ,కార్యక్రమంలో,. నియోజకవర్గం ఇంచార్జ్ రావుల పల్లి రామ్ ప్రసాద్, టిఆర్ఎస్ డివిజన్ లీడర్ శ్రీ. మానె. రామ కృష్ణ , పార్టీ లీడర్స్ కోటగిరి ప్రభోద్ కుమార్, తుమ్మలపల్లి. ధనేశ్వరరావు, సీనియర్ నాయుకులు, పృద్వి, సునీల్, వుండతా రమేష్, రేపాక. పూర్ణ, =. కిరణ్, కె. గోపి, మన్మధ రావు, తాత రావు , జానీ , కె. సాయి బాబు, ప్రేమ్ కుమార్, గోసుల. శ్రీనివాస్, శ్రీ మతి సీత,రాధ, ముంతాజ్, ప్రియాంక, కామేశ్వరి.ఇంకా అనేక మంది, మహిళలు, అధిక సంఖ్యలో పార్టీ సభ్యులు పాల్గొన్నారు.






## కాంగ్రెస్ పార్టి వైఫల్యాలపై బిఆర్ఎస్ నిరసన ర్యాలి





జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.

కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల వైఫల్యా పాలనపై అమనగల్ మున్సిపాలిటీ కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు కల్వకుర్తి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి,మాజీ ఎమ్మెల్యే. గూర్క జైపాల్ యాదవ్. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చెర్మన్ .ఉప్పల వెంకటేష్. ఆధ్వర్యంలో కదిలిన గులాబీ దండురేవంత్ ఇచ్చిన మోసపూరిత హామీలతో రూపొందించిన 420 మీటర్ల ప్లెక్సీ తో వినూత్న రీతిలో ర్యాలీ అడుగడుగున హర్షం వ్యక్తం చేస్తూ బిఆర్ఎస్.నిరసనకు మద్దతు పలికిన అమనగల్ పట్టణ ప్రజలు వద్దురా నాయనా ఈ కాంగ్రెస్ పాలన అంటూ నినాదాలు చేస్తూ మార్మోగిన అమనగల్ పట్టణం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వనికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విజయవంతంగా కొనసాగినా నిరసన ర్యాలీ..ఈ కార్యక్రమం లో వారితో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

## ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి వేడుకలు.

జన సముద్రం న్యూస్ , పినపాక నియోజకవర్గం ప్రతినిధి, సెప్టెంబర్ 2.



పినపాక మండలంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్, సినిమా హాల్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ పేదల పక్షపాతిగా అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని నాయకులు కొనియాడారు. అనంతరం సీనియర్ నాయకుడు గంగిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి 2 వేల మందికి పైగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గొడిశాల రామనాథం, నాయకులు గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బోడ రమేష్, కొర్సా ఆనంద్, సర్పంచులు, ఉపసర్పంచులు, సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన యువనేత కొర్స ఆనంద్.

జన సముద్రం న్యూస్ ,పినపాక నియోజకవర్గం ప్రతినిధి, సెప్టెంబర్ 2.



మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం క్రాస్ రోడ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

యువ కాంగ్రెస్ నాయకులు కొర్స ఆనంద్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొర్స ఆనంద్ మాట్లాడుతూ వైఎస్సార్ అమర్చిన ప్రజా సంక్షేమ పథకాలు, ఆయన చూపిన బాట నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి మరవలేనిదని, వైఎస్సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపసర్పంచ్ ల సంఘం అధ్యక్షులు అచ్చా నవీన్, మండల ఉపసర్పంచ్ ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మోహన్,సహాయ కార్యదర్శి గంగిరెడ్డి సందీప్ రెడ్డి,ఆత్మ కమిటీ డైరెక్టర్ హేమంత్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధార్ సాహెబ్, ఉప్పాక సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీల ఏర్పాట్లపై సమావేశం : ఎంఈఓ కొమరం నాగయ్య.

జన సముద్రం న్యూస్ పినపాక నియోజకవర్గం ప్రతినిధి, సెప్టెంబర్ 2 .



పినపాక మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణపై ఏడూళ్లబయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి కొమరం నాగయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 17 నుంచి జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని అధికారులు ఆకాంక్షించారు. సమావేశంలో పినపాక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. రామ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వీరన్న, రాములమ్మ, వరలక్ష్మి, విజయలక్ష్మి, లక్ష్మి, సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


## అభివృద్ధి ప్రణాళిక లో భాగంగా వీబీ-జీ రామ్ జీ గ్రామసభ.

జన సముద్రం న్యూస్ ,పినపాక నియోజకవర్గం ప్రతినిధి, సెప్టెంబర్ 2 .



పినపాక మండలం , తోగ్గూడెం పంచాయతీ కార్యాలయంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవిక మిషన్-గ్రామిణ్ చట్టం అమలుపై ప్రచారంలో భాగంగా అభివృద్ధి ప్రణాళికలకోసం బుధవారం నాడు గ్రామసభను నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ సోంపల్లి శ్రీను మాట్లాడుతూ వీబీ-జీ రామ్ జీ పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి సంవత్సరానికి రోజుల పనిదినాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ పనిదినాలను సంవత్సరంలో ఎప్పుడైనా వినియోగించుకోవచ్చని తెలిపారు. కోళ్లు,చేపల పెంపకం, కూరగాయల పెంపకాలపై ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల దృష్ట్యా రెండెకరాల పొలంకలిగిన ప్రతీ రైతు ఫారం పాండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు.వెదురు,మునగ సాగు వంటి పంటలు పండించి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఇంకుడు గుంత నిర్మించుకోవాలని కోరారు. ప్రతీ ఒక్కరు తమ దరఖాస్తులను పంచాయతీ కార్యాలయంలో గాని,నేరుగా ఫీల్డ్ అసిస్టెంట్ కు గాని ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం వెంకటేశ్వర్లు,ఉపసర్పంచ్ అచ్చ నవీన్,పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి,వార్డ్ మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# దుర్గారావు కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన సునీత



జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సెప్టెంబర్ 2;
రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్ మరియు మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమెర దుర్గారావు కి మాచర్ల పట్టణ టిడిపి మహిళా నాయకురాలు మంజుల సునీత రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కొమెర దుర్గారావు ఆఫీస్ లో జరిగిన పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు





జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సెప్టెంబర్ 2;
ఏపీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు మాచర్ల పట్టణంలోని టీడీపీ పార్టీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ కలిసి కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్ మరియు
మాచర్ల టిడిపి పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, జనసేన నాయకులు కొమెర లాలా కృష్ణ, షేక్ మదీన్, టిడిపి మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, బూత్ ఇన్చార్జ్ లు దొడ్డా చంద్రశేఖర్ (చందు), తెలుగుదేశం పార్టీ నాయకులు భాగం హనుమంతరావు పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అమరావతి పార్టీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు - అభివృద్ధే అమరావతి పార్టీ లక్ష్యం : నవులూరి శివారెడ్డి

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 2;
ఎక్కడైనా ఫ్యాక్షన్ రాజకీయాలు అసలు మంచివి కావని, దాని వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని , అభివృద్ధే అమరావతి పార్టీ లక్ష్యమని అమరావతి పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి అన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గంలో ఫ్యాక్షన్ చాలా వరకు తగ్గుముఖం పట్టిందని, ఇలాంటి నాయకుడు పదవిలో ఉంటే నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందుతుందని శివారెడ్డి ఆకాంక్షించారు. బ్రహ్మానందరెడ్డి హత్యా రాజకీయాలు చేయరని, అభివృద్ధి దిశగా నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తారని, జూలకంటి ఫ్యామిలీ అంటేనే అభివృద్ధి చిరునామా అని శివారెడ్డి తెలిపారు. నియోజకవర్గానికి ఇండస్ట్రీస్ తీసుకురావాలని, అప్పుడు యువత ఫ్యాక్షన్ వైపుకి వెళ్ళదని, కూటమి ప్రభుత్వం యొక్క ఈ రెండేళ్ల పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మన మాచర్ల నియోజకవర్గంలో చేపట్టడం జరిగిందన్నారు. ఇలాగే మంచి పరిపాలన అందించాలని శివారెడ్డి కోరారు. అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేసే ఏ ప్రభుత్వానికైనా అమరావతి పార్టీ తన పూర్తి మద్దతును తెలుపుతుందని శివారెడ్డి తెలియజేశారు.



నవులూరి శివారెడ్డి,
అమరావతి పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు
మాచర్ల సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి.

# ద్వారకాతిరుమలలో రేపు ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిత్యార్జిత సేవలు రద్దు



జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా సెప్టెంబర్ 2 ద్వారకా తిరుమల
ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో రేపు శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. జన్మాష్టమి నేపథ్యంలో శుక్రవారం ఒక్కరోజు స్వామివారి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు గమనించి సహకరించాలని కోరారు. అలాగే శనివారం సాయంత్రం క్షేత్రంలో ఉట్లు పండుగ, శ్రీవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

# .గర్భిణీలకు పంపిణీ చేస్తున్న టేక్ హోమ్ రేషన్ కిట్‌లో పురుగులు. -గర్భిణీల ఆరోగ్యంతో చెలగాటమా.. వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్

అనంతపురం , సెప్టెంబర్ 2, జనసముద్రం న్యూస్:
కళ్యాణదుర్గం తాలూకా కుందుర్పి మండలం లో అంగన్వాడీ కేంద్ర ల్లో గర్భిణీలు, బాలింతల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహార టేక్ హోమ్ రేషన్ కిట్‌లో పురుగులు కనిపించడం కలకలం రేపుతోంది. గర్భిణీలకు అందాల్సిన ఆహార పదార్థాల్లో పురుగులు ఉండటంతో లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు వివిధ రకాల ఆహార పదార్థాలతో కిట్లను పంపిణీ చేస్తోంది. అయితే, కిట్‌లోని ఆహార పదార్థాల్లో పురుగులు కనిపించడంతో వాటి నాణ్యత, నిల్వ విధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్య పరిరక్షణ కోసం అందిస్తున్న ఆహారంలోనే పురుగులు ఉండటం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.
సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కిట్‌లోని ఆహార పదార్థాలను పరిశీలించాలని, నాణ్యత లేని సరుకులను పంపిణీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సరుకుల నాణ్యతను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలని కోరుతున్నారు.

# ద్వారకాతిరుమలలో గడపగడపకూ కార్యక్రమం ఘన విజయం - శేషుబాబు కృతజ్ఞతలు



జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా
సెప్టెంబర్ 2 ద్వారకాతిరుమల
ద్వారకాతిరుమల గ్రామంలో నిర్వహించిన గడపగడపకూ కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో గ్రామ టీడీపీ అధ్యక్షుడు పాకనాటి శేషుబాబు పార్టీ శ్రేణులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు, పడిన శ్రమ ప్రశంసనీయమని అన్నారు. తమ ఇళ్ల వద్ద ఆదరించి సహకరించిన ప్రతి గ్రామ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అందరి సమష్టి కృషితోనే ఈ కార్యక్రమం ఘన విజయం సాధించిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లోనూ గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కలిసికట్టుగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

# గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు వేదికగా ఆత్మకూరు క్రీడా వికాస కేంద్రం

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- ఆత్మకూరులో అధికారులతో కలిసి క్రీడా వికాస కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి
- 20 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ప్రతిష్ఠాత్మక క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు ప్రణాళికలు
- క్రీడా వికాస కేంద్రం పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని సూచన
- గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఆత్మకూరును అభివృద్ధి చేస్తాం
- అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.28 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, పార్కుల అభివృద్ధి
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి





నెల్లూరు, సెప్టెంబర్ 2: జనసముద్రం జిల్లా ప్రతినిధి.
ఆత్మకూరు పట్టణంలో క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి, యువత, క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ఉదయం ఆత్మకూరులోని క్రీడా వికాస కేంద్రాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులు, రెవెన్యూ, క్రీడా శాఖాధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం క్రీడా ప్రాంగణ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు.
ఈ సందర్భంగా ప్రతిపాదిత క్రీడా ప్రాంగణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించిన మంత్రి, క్రీడా ప్రాంగణ నిర్మాణానికి రూపొందించిన డిజైన్లను పరిశీలించి అధికారులతో చర్చించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని యువత, క్రీడాకారులకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశాలమైన క్రీడా మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు.

**20 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణం**

ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మక స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో ఆర్డీవో, తహసీల్దార్లతో చర్చించి ప్రతిపాదించిన స్థలంతో పాటు, పక్కనే ఉన్న మరో 9 ఎకరాల 80 సెంట్ల స్థలాన్ని కూడా కలిపి మొత్తం 20 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.
నెల్లూరులోని ఏసీ స్టేడియం సుమారు 17 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికంటే పెద్దదిగా ఆత్మకూరు క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. నేషనల్ హైవే, అభయాంజనేయస్వామి ఆలయం, నాగులపాడు రోడ్డు తదితర ప్రాంతాలకు అనుసంధానంగా ప్రవేశ మార్గాలు, రహదారి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.
రాబోయే 15 నుంచి 20 రోజుల్లో సమగ్ర ప్రణాళిక నివేదికను సిద్ధం చేసి అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. క్రీడా రంగంలో ప్రతిభ కలిగిన గ్రామీణ యువతను గుర్తించి, వారికి ఆధునిక శిక్షణ, మెరుగైన వసతులు అందించడం ద్వారా భవిష్యత్‌లో ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.
ఆత్మకూరు ప్రాజెక్టు కింద క్రీడా వికాస కేంద్రం 2017 సెప్టెంబర్‌లో మంజూరు కాగా, 2018 ఆగస్టు 18న పనులు ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనుల్లో ఇప్పటికే సుమారు 50 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు.
గత ఎనిమిదేళ్లుగా కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల కాకపోయినా, సుమారు రూ.1 కోటి వరకు సొంత నిధులు వెచ్చించి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎస్ సి ఏ పి ఛైర్మన్ రవినాయుడు చొరవతో కాంట్రాక్టర్ మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అంగీకరించారని చెప్పారు.
మిగిలిన పనులు, పెంపు పనులను పూర్తి చేసేందుకు అదనంగా రూ.1.78 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు శాప్ అధికారులు అంగీకరించినట్లు మంత్రి తెలిపారు. ప్రణాళిక ప్రకారం మూడు నెలల్లో మిగిలిన పనులను పూర్తి చేస్తామని కాంట్రాక్టర్‌హామీ ఇచ్చినట్లు వెల్లడించారు క్రీడాకారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చి, ఆత్మకూరును క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా అభివృద్ధి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

**గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా ఆత్మకూరు**

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై కూడా మంత్రిఆనంరామనారాయణరెడ్డి దృష్టి సారించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో
ఆత్మకూరును గ్రేడ్1 మున్సిపాలిటీ స్థాయికి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.
వినాయక చవితి ఉత్సవాల అనంతరం పట్టణ నడిబొడ్డున పెద్ద ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి, ఆత్మకూరు పట్టణ అభివృద్ధిపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ సమావేశానికి రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, వారి సలహాలు, సూచనలు స్వీకరించి అభివృద్ధి ప్రణాళికలో పొందుపరుస్తామని తెలిపారు.
15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఆత్మకూరులో వివిధ మౌలిక వసతుల కల్పనకు రూ.2 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.28 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, పార్కుల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నట్లు వివరించారు.
మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్లతో అభివృద్ధి పనుల ప్రణాళికపై సమీక్షించి, సమగ్ర నివేదిక సిద్ధం చేస్తామని మంత్రి తెలిపారు. స్థానికంగా ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలు, అభివృద్ధి పనులు ఏమైనా మిగిలి ఉంటే ప్రజాప్రతినిధులు, స్థానికులు తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి కోరారు.
ఈ కార్యక్రమంలో రెవెన్యూ, క్రీడా శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం తెలియగానే.. క్షతగాత్రుల వద్దకు కలెక్టర్ పరుగులు

- బాధితుల పరిస్థితి తెలుసుకునేందుకు జీజీహెచ్‌కు హుటాహుటిన చేరుకున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల
- బుజబుజ నెల్లూరు సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి జిజిహెచ్ లో చికిత్స పొందుతున్న 17 మంది జార్ఖండ్ వాసులు





నెల్లూరు, సెప్టెంబరు 2, జన సముద్రం జిల్లా ప్రతినిధి.
రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారన్న విషయం తెలియగానే జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తక్షణమే స్పందించారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకునేందుకు హుటాహుటిన నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చేరుకుని, క్షతగాత్రులను స్వయంగా పరామర్శించారు.
బుజబుజ నెల్లూరు సమీపంలో అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం బోల్తా పడిన ప్రమాదంలో జార్ఖండ్‌కు చెందిన 21 మందిలో 17 మంది గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్ క్షతగాత్రుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.
ఆర్థోపెడిక్ సర్జికల్ వార్డుల్లో చికిత్స పొందుతున్న 16 మందిని, ఐసీయూలో చికిత్స పొందుతున్న మరో బాధితుడిని కలెక్టర్ పరామర్శించారు. గాయపడిన వారి పేర్లు, వారికి అందిస్తున్న చికిత్స వివరాలను కేసు షీట్ల ద్వారా పరిశీలించారు.
ప్రతి బాధితుడికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.
బాధితులకు తక్షణ ఆర్థిక సాయం
ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున, ఐసీయూలో చికిత్స పొందుతున్న బాధితుడికి రూ.1 లక్ష సాయం అందించాలని కాంట్రాక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమాచారాన్ని జార్ఖండ్ లోని కుటుంబ సభ్యులకు తెలిపి ఫోన్ పే ద్వారా వెంటనే నగదును వెంటనే అందించాలని ఆదేశించారు. బాధితులంతా కోలుకునే వరకు వారి యోగ క్షేమాలు చూసుకోవాలని, చెల్లించాల్సిన వేతనాన్ని కూడా పూర్తిగా చెల్లించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు
గాయపడిన వారంతా విద్యుత్ లైన్ల మార్పిడికి సంబంధించిన పనుల కోసం జార్ఖండ్ నుంచి మంగళవారం నెల్లూరుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నెల్లూరు నుంచి తిరుపతి జిల్లా బాలాయపల్లి సమీపంలోని దగ్గవోలు వద్ద పని ప్రదేశానికి వెళ్తుండగా బుజబుజ నెల్లూరు సమీపంలో ప్రమాదం జరిగినట్లు వివరించారు.
ప్రమాద ఘటనకు దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డి.ఎస్.పి ఘట్టమనేని శ్రీనివాసరావు, ఆర్డీఓ అనూష, కార్మిక శాఖ అధికారి విజయ్ కుమార్ రెడ్డి లను కలెక్టర్ ఆదేశించారు.
క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించి, వారు త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వైద్యులకు, జిజిహెచ్ సూపరెంటెండెంట్ కు ఆదేశించారు.
బాధితుల పరిస్థితిని స్వయంగా తెలుసుకునేందుకు ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్ స్పందన, క్షతగాత్రుల పట్ల ఆయన చూపిన ప్రత్యేక శ్రద్ధను చాటిచెప్పింది.

# ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలు అనంతగిరి మండల కేంద్రంలో జనసేన శ్రేణుల సందడి

అనంతగిరి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 02
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి 55వ జన్మదిన వేడుకలు అనంతగిరి మండల కేంద్రంలో జనసేన పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు చిట్టం మురళి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో జనసైనికులు, పార్టీ నాయకులు, పంచాయతీ స్థాయి నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ గారు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేయాలని, రాష్ట్ర అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించాలని నాయకులు ఆకాంక్షించారు.
కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు., చిట్టం మురళి జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు, కొర్ర ప్రవీణ్ కుమార్ మండల ఉపాధ్యక్షులు,పాంగి లక్ష్మణ్ మండల కార్యదర్శి,సాగర మధు,మండల నాయకులు,డిచంటి,మండలనాయకులు,అనంతగిరి







ఎగువ శోభ పంచాయతీ నాయకులు, రాజారావు బొంజోబాబు చిన్న రామన్న గంగరాజు దేముడు నాగేష్ ఇతర పంచాయతీ నాయకులు మజ్జి గడ్డయ్య, ఎన్.ఆర్.పురం పంచాయతీ అధ్యక్షులు కర్రీ శేషు,కివర్ల పంచాయతీ అధ్యక్షులు,వీరితో పాటుపలువురు జనసేన నాయకులు, జనసైనికులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పవన్ కళ్యాణ్ గారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.
**ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చిట్టం మురళి మాట్లాడుతూ..**
ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న పవన్ కళ్యాణ్ గారి ఆశయాలను ప్రతి జనసైనికుడు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి, యువతకు మెరుగైన భవిష్యత్తు కోసం పవన్ కళ్యాణ్ గారు చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని అన్నారు.
పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలని, రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఆయనకు కలగాలని నాయకులు ఆకాంక్షించారు. "పవన్ అన్నకు జన్మదిన శుభాకాంక్షలు ప్రజా సేవలో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ..."జనసేనపార్టీ, అనంతగిరి మండలం

జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
గురువారం ,సెప్టెంబర్,03,2026

## మహానేత వైఎస్ఆర్ కు ఘన నివాళిఅర్పించిన వై. సి. పి. నాయకులు.



జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్ తేది సెప్టెంబర్ 2

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నల్లగొండ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైసిపి శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బిడిజన అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి,ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా బిడిజన అప్పారావు మాట్లాడుతూ, వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్,ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్,మరియు ఇందిరమ్మ ఇండ్లు వంటి విప్లవాత్మక సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగాఎప్పుడు నిలిచిపోతాయన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగిన ఆయన పాలన చిరస్మరణీయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం అచ్చుత్, ఆర్టీఐ విభాగం నీలపు సూరిబాబు,రాష్ట్ర మహిళా విభాగం సభ్యురాలు జైతి రాజులమ్మ,జిల్లా సభ్యులు పొట్టిక పోతురాజు,సుమర్ల సూరిబాబు,మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ముసిలి నాయుడు పాల్గొన్నారు.అలాగే మండల కార్యదర్శిలు పెట్ల గాంధీ వార నూకరాజు (పండు), మాజీ సర్పంచ్‌లు బాలరాజు, శోభన్, చంద్రరావు, పెంటమ్మ, సావిత్రి,రాజకుమారి,పల్లి చిన్నబ్బాయి మరియు సీనియర్ నాయకులు,ఉల్లి రాంమూర్తి, వైఎస్సార్ అభిమానులు,పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మోటూరులో ఇంటి చోరీ కేసు ఛేదింపు

జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. సెప్టెంబర్.02.

రూ.4.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం.. నిందితుడి అరెస్ట్

గుడివాడ మండలం మోటూరు గ్రామంలో ఇంటి బీరువా లాకర్‌ను పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి మోటూరు గ్రామానికి చెందిన తాడిపర్తి అశోక్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, రూ.4.20 లక్షల విలువైన 48.014 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు గుడివాడ రూరల్ సీఐ ఎస్.ఎల్.ఆర్. సోమేశ్వరరావు తెలిపారు.

గుడివాడ రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ కేసు వివరాలను వెల్లడించారు. మోటూరుకు చెందిన గండికోట శివపార్వతి ఇంటిలో బీరువా లాకర్‌ను పగులగొట్టి బంగారు ఆభరణాలు అపహరించిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఎస్‌డీపీవో పాలా శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మోటూరు, పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టగా లభించిన ఆధారాల ఆధారంగా అశోక్‌కుమార్‌ను నిందితుడిగా గుర్తించినట్లు సీఐ




తెలిపారు.

నిందితుడి వద్ద, అతని ఇంటి వద్ద నుంచి బంగారు చైన్, బ్రాస్లెట్‌తో పాటు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 48.014 గ్రాముల బంగారు ఆభరణాలు, వాటి విలువ సుమారు రూ.4.20 లక్షలు ఉంటుందని తెలిపారు.

కేసును త్వరితగతిన ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబు, సీసీఎస్ ఎస్ఐ సత్యనారాయణ,పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు. వారి పనితీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రివార్డుకు సిఫారసు చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నిన్న గరిమండ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం ఎగవేత.



జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్.తేది సెప్టెంబర్ 2

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని గరిమండ ప్రభుత్వ ఉప ప్రాథమిక పాఠశాల (జీయూపీఎస్)లో బుధవారం మధ్యాహ్న భోజనం నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలలో భోజనం అందించకపోవడంతో మధ్యాహ్నం భోజనం కోసం ఇళ్లకు వెళ్లిన చిన్నారులకు నిరాశే ఎదురైంది.ఉదయం పిల్లలను పాఠశాలకు పంపించిన తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఇళ్ల వద్ద ఎవరూ లేకపోవడంతో పలువురు విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేక ఆకలితో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిరిజన ప్రాంతాల్లో విద్యార్థుల పోషకాహారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం పట్ల ఇలాంటి నిర్లక్ష్యం వహించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలో భోజనం ఎందుకు నిలిచిపోయిందనే విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ ఘటనకు పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమా, మధ్యాహ్న భోజన నిర్వాహకుల తప్పిదమా అన్నది విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ధర్మాజీగూడెం గ్రామంలో బెల్ట్ షాపులపై దాడులు





జనసముద్రం న్యూస్ చింతలపూడి ప్రతినిధి సెప్టెంబర్2

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్, ఏలూరు శ్రీమతి బి. శ్రీలత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ (ఎన్‌ఫోర్స్‌మెంట్), ఏలూరు కె.వి.ఎన్. ప్రభు కుమార్ మరియు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి, ఏలూరు జిల్లా ఏ. ఆవులయ్య ఆదేశాల ప్రకారం చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు మరియు సిబ్బంది కలిసి లింగపాలెం మండలం ధర్మాజీగూడం గ్రామంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించగా దేసిన రాటాలు అను మహిళ వద్ద నుండి (10) మద్యం సీసాలను స్వాధీన పరుచుకుని ఆ మహిళ పై కేసు నమోదు చేసినారు !

అలాగే ఈరోజు కామవరపుకోట మండలం కామవరపుకోట గ్రామంలో దాడులు నిర్వహించగా సాలి మరియమ్మ అను మహిళకు సంబందించిన (01) లీటరు నాటు సారాయిని స్వాధీన పరుచుకుని ఆ మహిళ పై కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించడమైనది!

అలాగే ఈరోజు లింగపాలెం మండలంలో గల ధర్మాజీగూడెం గ్రామంలో దేసిన వెంకటేశ్వరరావు మరియు తాళం సత్యనారాయణ అను ఇరువురి వద్ద నుండి రసాయనక పరీక్షలు పంపు నిమిత్తం కల్లును శాంపుల్ గా తీయడమైనది!

అలాగే ఈరోజు కామవరపుకోట మండలంలో గల పలు మద్యం దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించే సురక్ష యాప్ ద్వారా మద్య విక్రయాలు జరపాలని నౌకరణమాదారులకు తగు సూచనలు జారీ చేసినారు!

ఈ కార్యక్రమాలలో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్.ఐ. అబ్దుల్ ఖలీల్ ,మరియు జె. జగ్గారావు మరియు సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సి.ఐ. శ్రీ.పి. అశోక్ తెలిపారు!

## వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా,మహానేత రాజశేఖర్ రెడ్డకి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి.







నెల్లూరు, సెప్టెంబర్ 2, జన సముద్రం జిల్లా ప్రతినిధి.

బుధవారం పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు,జోహార్ వైఎస్ఆర్ అంటూ ఆ మహానేత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

**ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ**

వైయస్ రాజశేఖర్ రెడ్డి మనకు దూరమై,17 ఏళ్ళు అయినప్పటికీ, ఆయన ప్రతి పేదవాడి గుండెల్లోచిరస్థాయిగా నిలిచి ఉన్నారని తెలిపారు.

ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు మరువలేవని తెలిపారు.

ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్,ఉచిత విద్యుత్, జలయజ్ఞం పథకాలతో,అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన మహనీయుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి ని కొనియాడారు.

ఆ మహానేత ఆశయాలను ముందుకు తీసుకువెళ్లే దిశగా వారి తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా,ప్రజా పరిపాలన సాగించారని తెలిపారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం, ప్రజలను దగా చేసి వంచనకు గురిచేసిందన్నారు.

మళ్లీ ఈ రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలన రావాలని, జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాబోయే, రోజుల్లో,జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి ప్రజలకు,సుపరిపాలన అందిస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తు యువతే..!

- ఉద్యోగం, ఉపాధి కోసం పోరాటం
- డివైఎఫ్ఐ ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు జాక్ సి. థామస్
- ఘనంగా ప్రారంభమైన డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు
- నెల్లూరు ర్యాలీ, బహిరంగ సభ






నెల్లూరు, సెప్టెంబర్ 2, జనసముద్రం జిల్లా ప్రతినిధి.

దేశంలో జరుగుతోన్న అనేక ప్రజా ఉద్యమాలు, యువజన ఉద్యమాలకు వామపక్షాలు అండగా నిలుస్తున్నాయని దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని డివైఎఫ్ఐ ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు జాక్ సి, థామస్ అన్నారు. నెల్లూరు నగరంలో మూడ్రోజులపాటు జరగనున్న డివైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా నెల్లూరు నగరంలో ర్యాలీ నిర్వహించారు. నర్తకి సెంటర్ లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో యువత , విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఉద్యమిస్తున్నారన్నారు. డివైఎఫ్ ఐ ముందు బాగానా పోరాటం చేస్తుందన్నారు. ఇటీవల జరిగిన జన్ జీ ఉద్యమంలో వామపక్ష విద్యార్ధి సంఘాలు, యువకులు ముందుండి పోరాటం చేశారని గుర్తు చేశారు. యువత చేతిలో దేశ భవిష్యత్తు ఉందని మరోసారి నిరూపితమైందన్నారు. ఇప్పుడు యువజన సంఘం డివైఎఫ్ఐ అవసరం ఎందుకని అనేక మంది విమర్శలు చేస్తున్నారన్నారు. దేశంలో జరిగే అనేక పోరాటాల్లో యువత పాత్ర కీలకమైందన్నారు. వామపక్షాలు ఇటీవల ప్రముఖ ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్ ను ఓ జర్నలిస్టు అడుగుతూ దేశంలో లెఫ్ట్ పార్టీల అవసరం ఉందా అని ప్రశ్నించారని, దానికి ఆయన ఇచ్చిన సమాధానం భవిష్య వాణిని చెప్పలేనని, వామపక్ష రాజకీయాలు, డివైఎఫ్ఐ వంటి సంఘాల అవసరం లేకుండా ఇండియా, ఎపి, ఉండదన్నారు. వామపక్షాలు లేకపోతే దేశ భవిష్యత్తు అంధకారం అవుతుందని చెప్పారన్నారు. దేశంలో నేడు సాధారణ వ్యక్తులు, రైతులు, యువత, విద్యార్థులను బిజెపి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఇటీవల అండర్ ఇండెక్సు పోర్టు విడుదల చేసిందని, ఆహారం లేక ప్రపంచ దేశాల ప్రజల పరిస్థి ఎలా ఉందో తెలిపారన్నారు. ప్రపంచలో 125 దేశాల్లో ఒక సర్వే నిర్వహిస్తే ఇండియా 102 స్థానంలో ఉందన్నారు. ఆకలి మరణాలు, పేదరికం, కరువుల్లో దేశం ముందుందన్నారు. 125 దేశాల అంశాలను పరిశీలిస్తే సాధారణ మానవునికి ఆకలి చావులు లేకుండా చూడాల్సి ఉందన్నారు. ఆకలి వల్ల చనిపోయే పరిస్థి తి లేకుండా పేదరికాన్ని నిర్మూలించింది దేశలో ఒకే దేశమని, అదే సోషలిస్టు చైనా అన్నారు. చైనాలో ఒక్క చావు నమోదు కాకుండా పేదరికాన్ని వెనక్కి నెట్టి అభివృద్ధిలో దూసుకుపోతోందని, అందుకు కారణం సోషలిజం అమలు చేయడమేనన్నారు. ఇండియాలో ఒక రాష్ట్రం పేదరికాన్ని జయంచిందని, ఆకలి చావులను తరిమికొట్టిందని, అదే లెఫ్ట్ పార్టీల ఆధ్వర్యంలో నడిచిన కేరళ అన్నారు. ఈ విషయాలు దేశంలోనూ, రాష్రంలో ఉన్న పత్రికలు రాయడం కాదని, ప్రపంచ స్థాయి పత్రికలు రాశాయని గుర్తు చేశారు. దేశంలోనూ, రాష్రంలోనూ ఉద్యోగం, ఉపాధి, కోసం డివైఎఫ్ఐ పోరాటం చేస్తుందని యువతను మంచి మార్గంలో నడిపించడానికి ముందుకు నడుస్తోందన్నారు. దేశంలో కేవలం విద్యార్థులు, యువకులే కాదని, రైతులు కష్టాల్లో ఉన్నారన్నారు. ఢిల్లీలో ఏడాది పాటు రైతులు ఉద్యమం నిర్వహించారని, సుమారు 750 మంది రైతులు మృతి చెందారని గుర్తు చేశారు. ఇది చేసింది వామపక్షాల రైతు సంఘాలని గుర్తు చేశారు. మూడ్రోజులు జరుగుతోన్న డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలువిజయవంతంకావాలని ఆకాంక్షించారు. ఈ సభలకు డివైఎఫ్ఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి ఎంవి రమణ అధ్యక్ష వహించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు వై,రాము, జి.రామన్న, డివైఎఫ్ఐ నెల్లూరు జిల్లా అధ్యక్షులు బిపి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భారీ, బహిరంగ సభ.

డివైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా నెల్లూరు నగరంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. 16 మంది మహిళలు ఆ సంఘం పతాకాన్ని చేపట్టి ముందుబాగాన నడిచారు. విఆర్ సి మైదానం నుంచి ప్రారంభమైన రాలీ ట్రంకురోడ్డు మీదుగా గాంధీబొమ్మ, సుందరయ్య బొమ్మ మీదుగా నర్తకి సెంటర్ వరకు సాగింది. విఆర్ సి సెంటర్ లో సిఐటియు నాయకులు, గాంధీబొమ్మ వద్ద ఐద్వా నాయకులు, సుందరయ్య బొమ్మ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు ర్యాలీకి స్వాగతం పలికారు. యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పించాలని, గంజాయి అంతం, డివైఎఫ్ఐ పంతం, అంటూ నినదించారు

## మొళ్ళపర్రు శివారులో మట్టి మాఫియా జోరు!

మొగల్తూరు సెప్టెంబర్ 02 జనసముద్రం ప్రతినిధి

మొగల్తూరు మండలం పేరుపాలెం పంచాయతీ పరిధిలోని మొళ్ళపర్రు శివారు ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలువినిపిస్తున్నాయి. ఎటువంటి అనుమతులు ఉన్నాయో.. లేక నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయో స్పష్టత లేకపోయినా, భారీ యంత్రాలతో మట్టిని తవ్వి వాహనాల్లో తరలిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో గ్రామీణ రహదారులు దెబ్బతినడంతో పాటు, దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొళ్ళపర్రు శివారు ప్రాంతంలో



జరుగుతున్న తవ్వకాలపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అక్రమ మట్టి తవ్వకాలకు అధికారుల అండదండలు ఉన్నాయా?లేకఅధికారులుచూసీచూడనట్లువ్యవహరిస్తున్నారా?అనేఅనుమానాలువ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రాంతాన్ని




క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, మట్టి తవ్వకాలకు సంబంధించినఅనుమతులు, వాహనాల రవాణాపై పూర్తిస్థాయితనిఖీలునిర్వహించాలనిప్రజలుకోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో వైయస్సార్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి.



నెల్లూరు, సెప్టెంబర్ 2, జనసముద్రం జిల్లా ప్రతినిధి.

నెల్లూరు వైసిపి జిల్లా కార్యాలయంలోదివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్ చార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై,రాజశేఖర్ రెడ్డి హయాంలో పూర్తయిన.. పలు సాగునీటి ప్రాజెక్టులు నుంచి తీసుకువచ్చిన జలాలతో వైయస్సార్ విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈసందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసినసేవలను ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

పేదల గుండెల్లోరాజశేఖర్ రెడ్డి చిరస్మరణీయుడుగా నిలిచి ఉన్నారనికీర్తించారు.

# సాగర్ లో పవన్ కళ్యాణ్ అభిమానుల సందడి




- ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ..
- పేదలకు పండ్లు,బెడ్లు అన్నదానం చేసిన నేతలు

**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 02**

విజయపురిసౌత్: రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మాచర్ల మండలం విజయపురిసౌత్ లో బుధవారం ఘనంగా నిర్వహించారు.జన సైనికులు ముందుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి,సాగరమాత ఆలయం వద్ద పండ్లు ,బెడ్లు పంపిణీ చేసి,పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద కేక్ ను కట్ చేసిసంబరాలు జరుపుకున్నారు. జనసేన నేతలు,పవన్ కళ్యాణ్ అభిమానులు గ్రామ పురవీధుల్లో బైక్ ర్యాలీ చేసి సందడి చేశారు.స్థానిక జనసేన అధ్యక్షుడు రాహుల్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు.పేద బడుగు బలహీన వర్గాల ప్రజలఅభ్యున్నతి కోసంపవన్కళ్యాణ్ పాటుపడుతున్నారని అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన ఉపాధ్యక్షుడుఎం.శ్రీను,యూత్లీడర్సందేశ్(బన్ను), మైలపల్లిఅప్పలరాజు,బొబ్బిలిచంద్రశేఖర్,గంటాధనుంజ యరావు,ఎస్కేమస్తాన్,మెట్రిక్శ్రీను,భరత్,రాజేష్,చల్లా హరిష్,కటికలనాని,షాజీర్,గణేష్,కొమ్మూరినాగభూషణం, గోసలజగదీష్,బాషాతదితరులుపాల్గొన్నారు.

# వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా కడెంలో ఘన నివాళులు

**జననాడి కడెం న్యూస్ ప్రతినిధి శ్రీనివాస్ 2 సెప్టెంబర్ 2026**

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా కడెం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు గంగన్న గారి ఆధ్వర్యంలో అర్పించారు

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బొడ్డు గంగన్న ఏం సి చైర్మన్ భూషణ్ ఆర్టీఏ సభ్యులు మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ వైయస్ ఆర్ ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలను స్మరించుచున్నారు ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు

ఈ కార్యక్రమంలో కడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బబ్లు ఎస్ సి డిపార్ట్మెంట్ మండల అధ్యక్షులు జాడ రాజేశ్వర్ మైనారిటీ డిపార్ట్మెంట్ మండల అధ్యక్షులు సలీం మండల ప్రధాన కార్యదర్శి మూసుకో రాజేందర్



సర్పంచులు జంగు భూమన్న ఆత్మ డైరెక్టర్ శేఖర్ గ్రామ కమిటీ అధ్యక్షులు వసీదుద్దీన్ నాయకులు దూళి వెంకటేష్ చింతం రాజన్న ధూళి గంగాధర్ నారాయణ లక్ష్మణ్ లచ్చన్న తో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో ఘనంగా అన్నసమారాధన



**మొగల్తూరు సెప్టెంబర్ 02 జనసముద్రం ప్రతినిధి ధనంజయ్**

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మొగల్తూరు మండలం మోడి గ్రామంలోని శ్రీ సిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు, గ్రామస్తులకు అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ అభిమానులు, గ్రామస్తులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, సందడిగా సాగింది.

# తండ్రికి తగ్గ తనయుడు నారా లోకేష్ ..!
## -ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


**జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 02**




తండ్రి చంద్రబాబు నాయుడు ఆదర్శాలను పునికిపుచ్చుకున్న నిలువెత్తు రూపం నారా లోకేష్ అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కొనియాడారు. బుధవారం పల్నాడు జిల్లాలో లోకేష్ పర్యటనను ఉద్దేశించి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం హయంలో 2016 ముఖ్యమంత్రి చంద్రబాబు నరసరావుపేట మండలం, కాకానీ వద్ద జేఎన్టీయూ మంజూరు చేసి, దాదాపు రూ. 100 కోట్ల నిధులు కేటాయించారని గుర్తు చేశారు.

ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంతో చదువు విలువ తెలియని అజ్ఞానిగా ఉన్న జగన్ రెడ్డి కళాశాలలోని మౌలిక వసతులను గాలికొదిలేశారని మండిపడ్డారు. ఆనాడు చంద్రబాబు వేసిన బీజం దినదిన ప్రవర్ధమానంగా ఎదిగి వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వ రాకతో జేఎన్టీయూలో నెలకొన్న విద్యార్థుల సమస్యపై దృష్టిసారించింది. రూ. 70 కోట్ల నిధులతో 360 గదుల వసతి గృహాన్ని నిర్మించి, విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. విద్యార్థుల కళ్లముందు కదలాడే ఆనంద క్షణాల్లో వచ్చే కేరింతలు .., పవిత్ర వేదమంత్రాల నడుమ వసతి గృహాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించడం, ఆ కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి లోకేష్ చేస్తున్న వేగవంతమైన కృషి నభూతో నభవిష్యతి అని ఈ సందర్భంగా జూలకంటి కొనియాడారు.

# మండలంలో 234 పోలింగ్ బూత్‌లు: ఎంపీడీవో భారతి



**తూర్పుగోదావరి/ సీతానగరం/ సెప్టెంబర్ 02/ జనసముద్రం న్యూస్ :**

స్థానిక మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 234 పోలింగ్ బూత్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎం. భారతి బుధవారం తెలిపారు. వీటి తుది జాబితాను గత నెల 31న విడుదల చేసి, ప్రజల అవగాహన కోసం ప్రతి పంచాయతీలోని మూడు ప్రధాన ప్రాంతాల్లో అందుబాటులో ఉంచామన్నారు.

పంచాయతీల వారీగా పోలింగ్ బూత్లు బొబ్బిల్లంక, చినకొండేపూడి, రఘుదేవపురం, సీతానగరంలో 14 బూత్లు చొప్పున, ఇనుగంటివారిపేట, కాటవరం, మిర్తిపాడు, రాపాక, సింగవరం, ముగ్గళ్ల, పురుషోత్తపట్నం, ఉండేశ్వరపురం, వంగలపూడిలో 12 బూత్లు చొప్పున, మునికూడలి, వెదుళ్లపల్లిలో 10 బూత్లు చొప్పున, చీపురుపల్లి, జాలిమూడి, ములకల్లంక, నాగంపల్లి, నల్గొండలో 8 బూత్లు చొప్పున పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేసినట్లు భారతి తెలిపారు.

# గుడివాడలో పండగ వాతావరణంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు
## ...సందడి చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నేతలు

- పలు ప్రాంతాల్లో కేక్ కట్ చేసి జనసైనికుల్లో ఉత్సాహం నింపిన ఎమ్మెల్యేరాము.
- బూరగడ్డ శ్రీకాంత్ భారీ ర్యాలీ నుంచి ఐ.ఎం.ఏ. హాల్‌లో కుట్టు మిషన్ల పంపిణీ.
- ఆఫీసర్స్ క్లబ్‌లో సందు పవన్, కుమ్మరి చెరువు వద్ద త్రినాథ్, పెద ఎరుకపాడులో బుజ్జి వేడుకల్లో ఎమ్మెల్యే హాజరు
- జై పవన్ నినాదాలతో మార్మోగిన నెహ్రూ చౌక్ - టీడీపీ నేతల వేడుకల్లో యువత సందడి - అభిమానులకు శుభాకాంక్షలు చెప్పిన ఎమ్మెల్యే రాము
- సినిమాల్లోనే కాదు రాజకీయాల్లోనూ పవన్ కళ్యాణ్ సెన్సేషన్.
- పదవుల కోసం కాదు ప్రజల కోసం రాజకీయం చేసే నాయకుడు పవన్..
- గుడివాడలో తాగునీటి కలుషిత సమస్య చెప్పగానే 3 రోజుల్లో పరిష్కరించారు...పవన్ స్పందన చూసి ఆశ్చర్యపోయా
- చంద్రబాబు అరెస్టు సమయంలో ఆయన తెగువే కూటమి విజయానికి కారణం.








**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. సెప్టెంబర్.02.**

జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు గుడివాడ పట్టణంలో పండగ వాతావరణంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి జనసేన శ్రేణులు, అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు.

**బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ...**

గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది జనసైనికులతో భారీ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఐఎంఏ హాల్ వరకు సాగిన ర్యాలీ జనసేన నినాదాలతో హోరెత్తింది.

ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అభిమానులతో కలిసి భారీ కేక్‌ను కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

**టిడిపి నాయకులు వరుణ్...మహేష్ ఆధ్వర్యంలో...**

టిడిపి నాయకులు పంచకర్ల మహేష్, సమ్మెట వరుణ్ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాము, బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులతో కలిసి కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఎమ్మెల్యే రాము "జై పవన్ కళ్యాణ్" అంటూ నినాదాలు చేయడంతో జనసైనికులు, అభిమానులు పెద్దఎత్తున స్పందించారు. జై పవన్ కళ్యాణ్ నినాదాలతో నెహ్రూ చౌక్ పరిసరాలు మారుమోగాయి.

**సందు పవన్ ఆధ్వర్యంలో వేడుకలు...**

గుడివాడ ఆఫీసర్స్ క్లబ్‌లో జనసేన నాయకుడు సందు పవన్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని కేక్ కట్ చేసి జనసేన నాయకులు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

**వేమూరి త్రినాథ్ ఆధ్వర్యంలో....**

కుమ్మరి చెరువు వద్ద జనసేన నాయకుడు వేమూరి త్రినాథ్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుట్టినరోజు విందును ఎమ్మెల్యే ప్రారంభించారు.

**పెద ఎరుకపాడులో సందడి....**

పెద ఎరుకపాడులో జనసేన నాయకులు పుచ్చకాయల బుజ్జి ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలకు కేక్ తినిపించి పవన్‌కళ్యాణ్‌కుపుట్టినరోజుశుభాకాంక్షలు తెలిపారు.

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ "జై పవన్ కళ్యాణ్" నినాదాలతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

తన చిన్నతనంలో ఎన్టీఆర్ ప్రభంజనాన్ని చూశానని, ఆ తర్వాత పవన్ కళ్యాణ్‌కు ఉన్న అభిమానుల ప్రభంజనాన్ని చూస్తున్నానని అన్నారు. ప్రజలకు ఏదో ఒకటి చేయాలనే తపన పవన్ కళ్యాణ్ మాటల్లో,చేతల్లోఎప్పుడూకనిపిస్తుందని పేర్కొన్నారు.

గుడివాడలో తాగునీటి కలుషిత సమస్యను ఓ సమావేశంలో పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లానని, ఆ తర్వాత తాను తన పనుల్లో నిమగ్నమైపోయానని చెప్పారు. అయితే అదే రోజు సాయంత్రానికి అధికారులు తనకు ఫోన్లు చేసి, పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారని వివరించారు. పవన్ కళ్యాణ్ సమస్యను విన్న వెంటనే స్పందించిన తీరు తనను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు.

సినీరంగంలోనే కాదు.. రాజకీయాల్లోనూ పవన్ కళ్యాణ్ ఒక సెన్సేషన్ అని రాము అన్నారు. స్టైలిష్ యాక్షన్‌తో పాటు స్టైలిష్ రాజకీయాలకు కూడా పవన్ కళ్యాణ్ పెట్టింది పేరన్నారు. ప్రజల సమస్యలపై స్పందించే తీరు, సామాన్యుల పట్ల ఉండే అభిమానం ఆయనను ప్రత్యేకమైన నాయకుడిగా నిలబెట్టాయని పేర్కొన్నారు.

పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి రావడం రాష్ట్ర రాజకీయాలకు దక్కిన అదృష్టమని ఎమ్మెల్యే అన్నారు. పవన్ కళ్యాణ్ పదవుల కోసం కాకుండా ప్రజా ప్రయోజనాల కోసం మనసుతో రాజకీయాలు చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు పవన్ కళ్యాణ్ సహకారం ఎంతో కీలకమని అన్నారు.

చంద్రబాబు అరెస్టు సమయంలో పవన్ కళ్యాణ్ చూపిన తెగువ కూటమి శ్రేణుల్లోనే కాకుండా ప్రజల్లోనూ చైతన్యం తీసుకువచ్చిందని రాము పేర్కొన్నారు. కష్టకాలంలో వెనక్కి తగ్గకుండా ప్రజల పక్షాన నిలబడే నాయకత్వం పవన్ కళ్యాణ్ సొంతమన్నారు.

పవన్ కళ్యాణ్‌ను చూసిన ప్రతిసారీ తనలో తనకే తెలియని ఉత్సాహం వస్తుందని ఎమ్మెల్యే రాము అన్నారు. గుడివాడలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి శ్రేణులంతా ఐక్యంగా ఉన్నామని, మరింత బలంగా కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు.

పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు వ్యక్తిగతంగా శుభాకాంక్షలు చెప్పడంతో పాటు రాష్ట్ర ప్రయోజనాలకు, రాష్ట్ర అభివృద్ధికి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి మరింత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నానని ఎమ్మెల్యే రాము అన్నారు.

పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకలతో గుడివాడలో జనసేన శ్రేణులు, పవన్ కళ్యాణ్ అభిమానుల్లో పండగ వాతావరణం నెలకొంది. "జై పవన్ కళ్యాణ్" నినాదాలతో గుడివాడ మార్మోగింది.

పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, బొంబాయి శ్రీను,చేకూరు జగన్మోహన్రావు, నిమ్మగడ్డ సత్యసాయి, ఏపీ ఫిషరీస్ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తికొండ శ్రీ రాజబాబు, బిజెపి జిల్లా నాయకులు అంగడాల సతీష్, టిడిపి నాయకులు పంచకర్ల మహేష్, పోలసి ఉమామహేశ్వరరావు, పంచమర్తి శ్రీనివాసరావు, గుడివాడ జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, నాయకులు సాయన రాజేష్, తోట చిన్నారి, ఇంటూరి గజేంద్ర, తారక రామారావు, కనకదుర్గ, కళ్యాణి, శిరీష....కుమ్మరి చెరువు వద్ద జరిగిన వేడుకల్లో పంచకర్ల అమర్, కె. ఆంజనేయులు, పి. పూర్ణ, వెంకట రావు, వి. పవన్, డాన్ చందు అండ్ ఫ్రెండ్స్, పి. సౌమ్య, కె. పద్మా....గుడివాడ క్లబ్ లో జరిగిన వేడుకల్లో... గాడి కిరణ్, బురిడీ శాంతి నాయుడు, కందికొండ దుర్గ, వంగలపూడి రాము, సయ్యద్ నజీర్, షేక్ రబ్బాని, షేక్ కరీం,బాగి సుమంత్, గొల్లపల్లి నాగబాబు, బండారు నోబుల్ నాయుడు, తూము వెంకటరత్నం, సీతాల సుభాషిని.....పెద ఎరుకపాడులో జరిగిన వేడుకల్లో మత్తే అరవింద్, పుచ్చకాయల రాజేష్, కాట్రగడ్డ అరవింద్బా. రవి శంకర్... గుడివాడ పట్టణ వ్యాప్తంగా జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో జనసేన శ్రేణులు, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

# కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం..!
## శ్రీశ్రీశ్రీ బండి ముత్యాలమ్మ

**మొగల్తూరు సెప్టెంబర్ 2 జనసముద్రం ప్రతినిధి ధనంజయ్**

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరాధ్య దైవంగా కొలువుదీరారు. తమను నమ్మి మొక్కులు చెల్లించే భక్తుల కోర్కెలను అమ్మవారు తీర్చుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ప్రతి రోజు చుట్టుపక్కల గ్రామాల నుంచే రాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. తమ కుటుంబాల్లో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని వేడుకుంటారు. కోరిన కోర్కెలు నెరవేరిన అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకోవడం ఇక్కడ ఆనవాయితీగా కొనసాగుతోంది. అమ్మవారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తే మనసులోని కోరికలు నెరవేరుతాయని భక్తులు చెబుతున్నారు. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక పర్వదినాల్లో ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది.

ముత్యాలపల్లి గ్రామానికే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా బండి ముత్యాలమ్మ తల్లి కొంగుబంగారంగా, కష్టాలను తీర్చే తల్లిగా భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.




**బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం**

**అక్షరాలా రూ 21. 90 లక్షలు**

మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థాన హుండీలను బుధవారం లెక్కించారు. ఆలయ తనిఖీదారు పి.ఎస్. సాయి కుమారి, భీమవరం వారి పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి, ట్రస్ట్ బోర్డు చైర్మన్, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తుల సమక్షంలో హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. 76 రోజుల కాలానికి గాను హుండీల ద్వారా మొత్తం రూ.21,90,050 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా ఆలయానికి భారీగా హుండీ ఆదాయం సమకూరిందని తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియను నిర్వహించామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ట్రస్ట్ బోర్డు సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# ఒంటిమిట్టలో ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రాజంపేట టీడీపీ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు

**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, సెప్టెంబర్ 2:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఒంటిమిట్ట మండలంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులతో కలిసి కేక్ కట్ చేసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రాన్ని





ప్రగతిపథంలో నడిపించడంలో ఆయన పాత్ర కీలకమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట జెడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి టిడిపి నాయకులు బొబ్బిలి రాయుడు తుమ్మలకుంట ఈశ్వరయ్య ఎంపీటీసీ సుంకేసుల భాష సాలా బాద్ బుజ్జి పత్తి సుబ్బరాయుడు రమణ చంద్రపాల్ జనసేన నాయకులు జయ కృష్ణ నిత్యానంద రెడ్డి కిరణ్ స్వామి అయ్యావారయ్య తో పాటు టీడీపీ, జనసేన పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ఎమ్మెల్యే పై నెట్టడం తీవ్ర అన్యాయం

**- నిధులు ఇవ్వకుండా నిందలు వేస్తే ఎలా**

**- రాష్ట్ర పల్లవ సేన అధ్యక్షుడు కొల్లాటి బాబురావు**



**మొగల్తూరు సెప్టెంబర్ 2 జనసముద్రం ప్రతినిధి ధనంజయ్**
మొగల్తూరులో నిర్వహించిన 'ప్రజా వేదిక' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పనితీరుపై చేసిన వ్యాఖ్యలపై పల్లవ సేన తరఫున మా అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాము.

ముఖ్యమంత్రి ఎమ్మెల్యే పనితీరును సమీక్షించడం ఆయన బాధ్యత. అయితే, దశాబ్దాలుగా పరిష్కారం కానిసమస్యలకుఅవసరమైననిధులుకేటాయించకుండా, అభివృద్ధి పనులను పెండింగ్‌లో ఉంచి, వాటి ప్రభావంతో ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తికి ఎమ్మెల్యేనే పూర్తిగా బాధ్యుడిగా చేయడం ఎంతవరకు సమంజసం? నరసాపురం నియోజకవర్గ ప్రజలు రాజకీయ విమర్శలు కోరుకోవడం లేదు. వారికి అభివృద్ధి కావాలి. శాశ్వత పరిష్కారాలు కావాలి.

**నరసాపురం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు**

1. గొంతేరు కాలుష్యం
గొంతేరు కాలువ కాలుష్యం అనేది చాలాకాలంగా కొనసాగుతున్న తీవ్రమైన సమస్య. కాలుష్యం వల్ల ప్రజలు, రైతులు, మత్స్యకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
కాలుష్యానికి మూల కారణాలను గుర్తించి, సంబంధిత శాఖలతో సమగ్ర అధ్యయనం చేయించి, గొంతేరు కాలుష్యానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

2. నరసాపురం మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్
నరసాపురం పట్టణంలో చెత్త నిర్వహణ, డంపింగ్ యార్డ్ సమస్యకు శాస్త్రీయమైన పరిష్కారం అవసరం. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా ఆధునిక సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేసి డంపింగ్ యార్డ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

3. ఫిషింగ్ హార్బర్
నరసాపురంమొగల్తూరు తీర ప్రాంత మత్స్యకారుల చిరకాల ఆకాంక్ష అయిన ఫిషింగ్ హార్బర్‌కు అవసరమైన నిధులను కేటాయించి, పనులను వేగవంతం చేయాలి.
ఇది కేవలం ఒక నిర్మాణ ప్రాజెక్టు కాదు. వేలాది మత్స్యకార కుటుంబాల జీవనోపాధితో ముడిపడి ఉన్న అంశం.

4. వశిష్ట వారధి
రెండు జిల్లాలను అనుసంధానించే కీలకమైన వశిష్ట వారధి నిర్మాణానికి అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో కేటాయించి, పనులను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలి.
ఈ వారధి పూర్తయితే రవాణా, వ్యాపారం, విద్య, వైద్యం, వ్యవసాయం, మత్స్య రంగాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

5. ఫిషింగ్ యూనివర్సిటీ
నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన భవనాలు, ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలు, మౌలిక వసతులకు తగిన నిధులు కేటాయించాలి.
నరసాపురం తీర ప్రాంత మత్స్య సంపద, ఆక్వా రంగానికి ఇది ఒక ముఖ్యమైన విద్యా, పరిశోధనా కేంద్రంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

6. కాళీపట్నం జమీందారు భూముల సమస్య
కాళీపట్నం జమీందారు భూములకు సంబంధించిన సమస్య దశాబ్దాలుగా కొనసాగుతోంది.
భూ రికార్డులు, హక్కులు, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఈ దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

7. డ్రైనేజీ మరియు ముంపు సమస్య
నరసాపురం, మొగల్తూరు, పరిసర గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ, వర్షపు నీరు, మురుగునీరు, ముంపు సమస్యలకు సమగ్ర ప్రణాళిక రూపొందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

8. రోడ్లు, వంతెనలు, కల్వర్టులు
నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులు, వంతెనలు, కల్వర్టులకు అవసరమైన నిధులు కేటాయించి నాణ్యమైన పనులతో అభివృద్ధి చేయాలి.

9. తీర ప్రాంత రక్షణ
సముద్రపు కోతకు గురవుతున్న తీర ప్రాంత గ్రామాలను రక్షించేందుకు శాస్త్రీయ అధ్యయనం నిర్వహించి శాశ్వత తీర రక్షణ చర్యలు చేపట్టాలి.

10. మత్స్యకార గ్రామాల మౌలిక వసతులు
మత్స్యకార గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, చేపల నిల్వ, మార్కెటింగ్ తదితర మౌలిక వసతులను ప్రభుత్వం బలోపేతం చేయాలి.

11. తాగునీరు, వైద్య సదుపాయాలు
నియోజకవర్గంలోని తాగునీటి సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి శాశ్వత తాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది, పరికరాలు, అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేయాలి.

12. ఆక్వా రంగ సమస్యలు
ఆక్వా రైతులు, మత్స్యకారులు ఎదుర్కొంటున్న విద్యుత్, నీటి నాణ్యత, మార్కెటింగ్, ధరలు, కాలుష్యం, మౌలిక వసతుల సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి.

13. యువతకు ఉపాధి
నరసాపురం ప్రాంత యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా మత్స్య, ఆక్వా, ఆహార ప్రాసెసింగ్, చిన్న పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రోత్సహించాలి.

14. పెండింగ్ అభివృద్ధి పనులకు నిధులు
నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను శాఖల వారీగా గుర్తించి, వాటికి అవసరమైన నిధులను విడుదల చేసి పనులను పూర్తి చేయాలి.

15. ప్రత్యేక నరసాపురం అభివృద్ధి ప్యాకేజీ
పై సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు నరసాపురం నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ప్రకటించాలి. ప్రతి సమస్యకు అవసరమైన నిధులు, కాలపరిమితి, బాధ్యత వహించే శాఖను స్పష్టంగా నిర్ణయించి పనులను పూర్తి చేయాలి. ముఖ్యమంత్రి పల్లవ సేన విజ్ఞప్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని పల్లవ సేన తరఫున కోరుతున్నాము.
నరసాపురం నియోజకవర్గాన్ని రాజకీయ విమర్శల కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో చూడండి.
దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించండి.
ప్రతి సమస్యకు అవసరమైన నిధులను అంచనా వేయండి.
బడ్జెట్ కేటాయించండి.
పెండింగ్ పనులకు నిధులు విడుదల చేయండి. శాఖల మధ్య సమన్వయం కల్పించండి. కాలపరిమితితో పనులు పూర్తి చేయించండి.
ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజలు ప్రతికూలంగా స్పందిస్తే, ఆ ఫలితాన్ని కేవలం ఎమ్మెల్యే పనితీరుగా చూడకుండా, ప్రజలు ఎందుకు అసంతృప్తిగా ఉన్నారో ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఎమ్మెల్యే ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలరు. కానీ నిధులు విడుదల చేయడం, పరిపాలనా అనుమతులు ఇవ్వడం, వివిధ శాఖలను సమన్వయం చేయడం ప్రభుత్వ బాధ్యత.
కాబట్టి నిధులు కేటాయించకుండా ఎమ్మెల్యేపై మాత్రమే నిందలు వేయడం సమంజసం కాదని పల్లవ సేన స్పష్టం చేస్తోంది.
మా నినాదం నిందలు కాదు నిధులు కావాలి. విమర్శలు కాదు అభివృద్ధి కావాలి హామీలు కాదు శాశ్వత పరిష్కారాలు కావాలి నరసాపురం నియోజకవర్గ ప్రజల చిరకాల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన నిధులు కేటాయించి, దశాబ్దాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని పల్లవ సేన తరఫున కోరుతున్నాము.


# మునికూడలిలో మ్యాజిక్ డ్రైన్ నిర్మాణంపై అవగాహనా కార్యక్రమం

**తూర్పుగోదావరి/ సీతానగరం/ సెప్టెంబర్ 02/ జనసముద్రం న్యూస్ :**
స్థానికమండలపరిధిలోనిమునికూడలిగ్రామపంచాయతీ నందు బుధవారం మ్యాజిక్ డ్రైన్ నిర్మాణంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి అధికారులు సి.క్యూ.సి.ఓగోపిచంద్, డ్వామా పిడి నాగేశ్వరరావు, ఎస్.ఈ పి.ఆర్ బాలకృష్ణ, ఎస్.క్యూ.సి.ఐ, రాజమండ్రి క్లస్టర్ ఎపిడి నరేష్ కుమార్, జె.క్యూ.సి.ఓ నరేష్, ఎంపీడీవో భారతిలతో పాటు ఎపివో సత్యవాతి, టెక్నికల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు,





కూటమి నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సాధారణ మురుగు కాల్వలతో పోల్చితే మ్యాజిక్ డ్రైన్నిర్మాణానికి ఖర్చుచాలా తక్కువగా అవుతుందని, వాడిన నీరు నిల్వ ఉండకుండా ఎక్కడికక్కడే భూమిలోకి ఇంకిపోతుందని, మురుగు నీటి సమస్య తీవ్రత తగ్గి, దోమల వ్యాప్తి అరికట్టబడుతుంది. దీనివల్ల గ్రామంలో ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడతాయని అన్నారు.



# హెడ్ కానిస్టేబుల్ గా వీరపోగు వెంకటయ్య కు పదోన్నతి

**ఓబుళవారిపల్లి, సెప్టెంబర్ 2: జన సముద్రం న్యూస్ :**
ఆంధ్ర ప్రదేశ్ తిరుపతి జిల్లా ఓబుళవారిపల్లి పోలీస్ స్టేషన్‌లో 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న వీరపోగు వెంకటయ్య హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందారు.
తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ఆయనకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించారు. పోలీస్ శాఖలో విధి నిర్వహణలో చూపిన సేవలను పరిగణనలోకి తీసుకుని పదోన్నతి లభించడం పట్ల సహచర పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా వెంకటయ్యకు పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. పదోన్నతితో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఘనంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.







**కుక్కునూరు, సెప్టెంబర్ 02, 2026.**
**జనసముద్రం ప్రతినిధి మణికంఠ**
జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు కుక్కునూరు మండలంలో బుధవారం లో జనసేన ఉపాధ్యక్షులు మంత్రి గోపాల కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కుక్కునూరు కొత్త రామాలయం లో జనసేన ఉపాధ్యక్షులు మంత్రి గోపాల కృష్ణ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పేరు మీద అర్చన చేపించి అయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని ఆ రామయ్య తండ్రికి పూజలు నిర్వహించారు.
ఈ సంధర్భంగా జనసేన ఉపాధ్యక్షులు మంత్రి గోపాల కృష్ణ మాట్లాడుతూ... "పేద ప్రజల కోసం, నిస్వార్థంగా పోరాడుతున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అని ఆయన ఆశయ సాధన కోసం మేమందరం కలిసి పని చేస్తాం. ఆయన ఆయురారోగ్యాలతో, మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు.
ఈ వేడుకల్లో జనసేన నాయకులు చల్ల కోటి, గాడిద వెంకటేశ్వర్లు, సమయమంతుల లక్ష్మణ స్వామి,రాయి కృష్ణార్జున రావు,చల్లకోటి శివ, తోట కృష్ణ, నరసింహ రావు, రాంబాబు, వీరయ్య యువసేన నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కోటనెమలిపురి ఎస్సీ కాలనీలో ఆయుర్వేద ఆరోగ్య శిబిరం డాక్టర్ ఆర్ శ్రీనివాస్

**జనసముద్రం (నాయక్ )(రాజుపాలెం )**



మండలం కోటనెమలిపురి ఎస్సీ కాలనీలో పై అధికారుల రోణంకి గోపాలకృష్ణ డైరెక్టర్ ఆయుష్ శాఖ,డాక్టర్ ఎం శేఖర్ రాజు ప్రాంతీయ ఉపాసంచాలకులు ఆదేశానుసారం డాక్టర్ ఆర్ శ్రీనివాస్ ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పైన ఆరోగ్యం పైన అవగాహన సదస్సు మరియు వైద్య శిబిరం డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యం పైన అందరూ అవగాహన కలిగి ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత వాటి ప్రాముఖ్యత గురించి తెలియపరచి ఈ కాలంలో వృద్ధులు గర్భిణీ స్త్రీలు పిల్లలు సీజనల్ వ్యాధుల, నీరసం నుంచి తప్పించుకోవడానికి ప్రతిరోజూ 3-4లీటర్ల నీరు, కొబ్బరి నీళు,, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలి. ప్రతిరోజు యోగా ధ్యానము ప్రాణయామము చేయాలని తరచుగా నీరు తాగాలి, నిమ్మరసం, కొబ్బరి నీరు, సబ్జనీరు రాగి జావా సంకటి మజ్జిగ మరియు ఒక గ్లాస్ నీటిలో నిమ్మకాయ రసం చిటికెడు ఉప్పు కొంచెం కండ చక్కెర కలుపుకొని త్రాగవలెను వారందరికీ వైద్య శిబిరం నిర్వహించే ఆయుష్ మందులను పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కళ్యాణి అంగన్వాడీ టీచర్. జి జీవయ్య చంద్రపాటి శ్రీను అచ్చమ్మ రత్నకుమారి శిరీష గ్రామస్తులు మొదలగు వారు పాల్గొన్నారు ఆయుష్ సిబ్బంది ఎస్ లక్ష్మీనారాయణ కాంపౌండర్ పాల్గొన్నారు

# అనారోగ్యంతో విజయవాడలో ఉన్న లబ్ధిదారుడికి పెన్షన్ అందజేత

## విజయవాడ వెళ్లి పెన్షన్ అందించిన ఫీల్డ్ అసిస్టెంట్



**మొగల్తూరు సెప్టెంబర్ 2 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**
అనారోగ్యంతో విజయవాడలో ఉంటున్న పెన్షన్ లబ్ధిదారుడికి గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ స్వయంగా విజయవాడకు వెళ్లి పెన్షన్ అందజేశారు. మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్ గ్రామ పంచాయతీకి చెందిన పెన్షన్ లబ్ధిదారుడు కొణతం సుబ్బారావు అనారోగ్య కారణాలతో విజయవాడలో ఉంటున్నారు. పెన్షన్ తీసుకునేందుకు స్వగ్రామానికి రావడం ఇబ్బందిగా ఉన్న విషయాన్ని గుర్తించిన గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ బొక్క త్రిమూర్తులు విజయవాడకు వెళ్లి లబ్ధిదారుడికి పెన్షన్‌ను అందజేశారు.
అనారోగ్యంతో బాధపడుతున్న లబ్ధిదారుడి పరిస్థితిని అర్థం చేసుకుని స్వయంగా వెళ్లి పెన్షన్ అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులకు సకాలంలో అందేలా సిబ్బంది చేస్తున్న సేవలను పలువురు అభినందించారు.


# మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి

**జనసముద్రం న్యూస్ అమడగూరు 02/09/2026**



సత్య సాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం ఆమడగూరు మండలంలోలోని YSR విగ్రహం వద్ద శ్రీ దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి గారి పిలుపు మేరకు ఆమడగూరు మండల YSRCP నాయకులు,కార్యకర్తలు మహానేత YSR రాజశేఖర్ రెడ్డి కి 17వ వర్ధంతి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అముడగూరు మండల్ వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ ర్ తనకంటి జయప్ప మాట్లాడుతూ మహానేత అపర భగీరథుడు బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన మహానేత ఆరోగ్య శ్రీ విధాత 104 108 పేదలకు ఉచిత వాహనాలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రైతు భరోసా రైతులకు పంట నష్ట పరిహారం ఇన్పుట్ సబ్సిడీ ఇన్సూరెన్సుబ్సిడీ పథకాలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేద విద్యార్థులకు ఫీజు ఫ్లీజ్ రియంబర్స్ వెలుగులోకి తెచ్చి పేదవిద్యార్థులు కలలో ఆనందం నింపిన ఎన్నో ఉన్నతమైన ఉద్యోగాలు ఇచ్చినమహానేత వృద్ధులకు వితంతువులకు పెన్షన్లు ఇచ్చిన మహాదాత హంద్రీనీవా కాలువలకు నీరు తెప్పించిన మహానేత అలాంటి మహనీయుని అడుగుజాడల్లో నడుస్తున్న నాయకుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయాల పైన నడిసి రాజశేఖర్ రెడ్డి ఆశయాలపై పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు ప్రతి వైయస్సార్ అభిమానికి నాయకులకు ప్రజలకు మహిళలకు యువకులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు అదే విధంగా వైయస్సార్ మండల నాయకులు సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి తనయుడిని మన ప్రజల గుండెల్లో నిలుపుకొని ముఖ్యమంత్రిగా నిలుపుకునే బాధ్యత మనందరిపై ఉన్నదని సీనియర్ నాయకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు తనకంటే జయప్ప శేషరెడ్డి సురేందర్ రెడ్డి ఎంపిటి తుమ్మల భారతి రెడ్డి సురేందర్ రెడ్డి నక్కలరమేష్ ఎస్ పాల్ చిన్నప్ప జహీర్ సుభక్తుల్లా కందుకూరుపల్లి నాగరాజు హరిపురం ఆంజనేయులు వెంకటాచారి చంద్ర చీకరేవులపల్లి ఆది కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# పురుషోత్తపట్నం నిర్వాసిత రైతులకు త్వరలోనే పరిహారం: వివరాల సేకరణ ప్రారంభం




**తూర్పుగోదావరి/ సీతానగరం/ సెప్టెంబర్ 02/ జనసముద్రం న్యూస్ :**
పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు త్వరలోనే పరిహారం అందించేందుకు రెవెన్యూ అధికారులు వివరాల సేకరణ చేపట్టారు. ఈ పథకం కింద 90 మంది రైతులకు చెందిన 75 ఎకరాలకు పైగా భూములకు సంబంధించి రూ.32.10 కోట్ల పరిహారం విడుదల చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఇటీవల జీవో 496 జారీ చేశారు. దీనిలో భాగంగా రామచంద్రపురం కమ్యూనిటీ హాలులో తహసీల్దార్లు ఎన్. శ్రీనివాస్, సుబ్బారావు, సాయి ప్రసాద్, సీతారామయ్య ఆధ్వర్యంలో పురుషోత్తపట్నం, రామచంద్రపురం పరిధిలోని రైతుల నుంచి వివరాలు సేకరించారు. చినకొండేపూడి, వంగలపూడి, నాగంపల్లి ప్రాంతాల రైతుల నుంచి వివరాలు తీసుకున్నారు. అధికారులు రైతుల వద్ద నుంచి పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలను సేకరిస్తున్నారు.

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL / 2021 / 16151 for Queries Contact us @ 94941 84136,
janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb / janasamudram

# P4 విధానంలో పోలీస్ స్టేషన్లకు రూ.24 లక్షల వాహనాల విరాళం - గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



P4 విధానంలో పోలీస్ శాఖకు బొలెరో వాహనాలను అందజేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులు.

**జనసముద్రం న్యూస్ తూర్పుగోదావరి జిల్లా సెప్టెంబర్ 2 రాజమహేంద్రవరం**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న P4 విధానంలో భాగంగా గోపాలపురం, దేవరపల్లి పోలీస్ స్టేషన్లకు రూ.24 లక్షల విలువైన రెండు మహీంద్రా బొలెరో నియోవాహనాలను అందజేశారు.

రాజమహేంద్రవరం జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, ఐపీఎస్ కు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు వాహనాలను అందజేశారు. గోపాలపురం పీఎస్ కు ఒక వాహనాన్ని ఎమ్మెల్యే సొంత నిధులు, మండల నాయకుల సౌజన్యంతో అందజేయగా, దేవరపల్లి పీఎస్ కు మరో వాహనాన్ని పరమేశు బయోటెక్ ఎండీ ఆనంద స్వరూప్ సౌజన్యంతో అందజేశారు. ఒక్కో వాహనం విలువ రూ.12 లక్షలు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పోలీసు శాఖకు వాహనాలు సమకూర్చడం ద్వారా అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ, కొవ్వూరు, ఎస్బీ, ఏఆర్ డీఎస్పీలు, దేవరపల్లి సర్కిల్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని ప్రగతిపదం లో నడిపిన వైఎస్సార్.

**పుల్ల ల చెరువు,సెప్టెంబర్ 3 జనసముద్రం న్యూస్.**



మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి పదంలో నడిపించాడని వైసిపీ నాయకులు అన్నారు. మండలకేంద్రమైన పుల్లల చెరువులో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సా ర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులార్పించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి పంపిణీ చేశారు. ఈరోజు సందర్భంగా వైసిపీ నాయకులు మాట్లాడుతూ, వైఎస్సార్ హయాంలో రాష్ట్రం స్వర్ణ యుగంగా మారిందాన్నారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేశాడాన్నారు.ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజల గుండెల్లో చిరస్తాయిగా నిలిచాడని కొనియాడారు. ఆరోగ్యశ్రీ పదకంతో ఎంతో మంది ప్రాణాలను కాపాదా డని అన్నారు. కూటమి ప్రభుత్వం వైసిపీ నాయకుల పై కక్ష సాధిస్తుందని, అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేస్తుందని వారు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వైసిపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదాన్నారువైఎస్సా ర్ ఆశయాల కానుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు.

ఈ కార్యక్రమం లో వైసిపీ మండల కన్వీనర్ దోమకాల వెంకటేశ్వర్లు, వైసిపీ నాయకులు లింగంగుంట్ల రాములు, కోర్లకుంట. జానాకీరఘు, ఆవుల కోటిరెడ్డి, తమ్మినేని సత్యనారాయణ రెడ్డి, ఆవుల. రమణారెడ్డి,కుడుముల కాశయ్య, కంచర్ల దినేష, ముద్దా వాస్, కంచల ఏడుకొండలు, కాయకోకుల బచ్చయ్య, హరి నాయక్, వస్త్రం నాయక్, ఏ శ్రీనివాస్ రెడ్డి, షేక్ బాజీ, డి ఖాసిం వలి, వేముల గాలయ్య లింగంగుంట్ల ప్రసాద్, నీలం దానియేలువివిధ గ్రామాల నాయకులు, కార్యక్రర్తలు పాల్గొన్నారు..

# మాచర్లలో ఘనంగా జరిగిన పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

## వకీల్ సాబ్ బత్తుల బాబురావు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్, మహిళలకు చీరలు పంపిణీ



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సెప్టెంబర్ 2;**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన నాయకుడు వకీల్ సాబ్,బత్తులబాబురావుఆధ్వర్యంలో మాచర్లపట్టణంలోఘనంగా నిర్వహించారు. నెహ్రూనగర్ మొదటి లైన్‌లోని బీసీ సామాజికవర్గానికి సంబంధించిన కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకలకు జనసేన కార్యకర్తలు, వీర మహిళలు భారీగా తరలివచ్చారు. వకీల్ సాబ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా వకీల్ సాబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. మహిళలకు చీరలు అందజేశారు. పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. వకీల్ సాబ్ మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సేవ చేయాలని అన్నారు. పేదలు, బలహీన వర్గాలు, మహిళలకు అండగా నిలవడం ప్రతి జనసేన కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ పుట్టినరోజు వేడుక కార్యక్రమంలో రఘువర్మ, బత్తుల శివ, నాగేశ్వరరావు, చక్రధర్, బొజ్జం మల్లికార్జునరావు, పవన్, కొమ్ము రాజు తదితరులతో పాటు పలువురు జనసేన కార్యకర్తలు, వీర మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ కు ఘన నివాళులు




**తూర్పుగోదావరి/ సీతానగరం/ సెప్టెంబర్ 02/ జనసముద్రం న్యూస్ :**

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సీతానగరంలోని మదర్ థెరిస్సా సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి వైసిపి మండల సీనియర్ నాయకుడు పెదపాటి రమేష్ (డాక్టర్ బాబు) పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా డాక్టర్ బాబు మాట్లాడుతూ ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలతో వైయస్సార్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని రమేష్ కొనియాడారు. వైయస్సార్ ఆశయాలకు అనుగుణంగా వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించి, అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించారన్నారు. ఎన్నికల ముందు అబద్ధపు హామీలిచ్చిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో వలవల వెంకటరాజు,పెందుర్తి దేవదాస్,కొండ్రపు ముత్యాలు,వలవల సత్తిబాబు,కోలా శీను,అధికారి శ్రీను,మట్ట నాగయ్య,ముల్లా నైస్ స్వామి,పెదపాటి ప్రసాద్,ఈతా వీరాబాబు తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడా పోటీల ఏర్పాట్లపై సమావేశం : ఎంఈఓ కొమరం నాగయ్య.



**జన సముద్రం న్యూస్ పినపాక నియోజకవర్గం ప్రతినిధి, సెప్టెంబర్ 2**

పినపాక మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణపై ఏడూళ్లబయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు.

మండల విద్యాశాఖాధికారి కొమరం నాగయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 17 నుంచి జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని అధికారులు ఆకాంక్షించారు. సమావేశంలో పినపాక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. రామ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వీరన్న, రాములమ్మ, వరలక్ష్మి, విజయలక్ష్మి, లక్ష్మి, సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ విద్యార్థిని చదువు కోసం.. మూడు లక్షల 50 వేలు సహాయం అందించిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, గురజాల, సెప్టెంబర్ 2:**

"నిరుపేద" పోతురాజు వెంకటేశ్వర్లు" ముదిరాజ్" గురజాల నియోజకవర్గం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ను కలసి తన ఆర్థిక స్థితి చెప్పిన రెండో రోజే పోతురాజు ఇంటి తలుపు తట్టి.. ఇంజనీరింగ్ చదువుతున్న నాగ మల్లేశ్వరి మూడేళ్ల చదువు కోసం మూడు లక్షల 50 వేలు అందిస్తూ... కుటుంబ ఖర్చుల కోసం మరో 50 వేలు తక్షణ సహాయాన్ని అందించి... "ముదిరాజుల "జాతి పట్ల మంచి మనసు మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే యరపతినేని కి ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళితే... పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం. మాచవరం మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పోతురాజు వెంకటేశ్వర్లు ముదిరాజ్ గ్రామంలో రాజకీయంగా అన్ని వర్గాల్లో పట్టున్న మంచి నాయకుడిగా పేరు పొందాడు. మావోయిస్టు ఉద్యమ సమయంలో రాజకీయ పార్టీ నాయకులు భయంతో గ్రామ విడిచి వెళ్లిన పోతురాజు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాత్రం ధైర్యంగా ఉండి టిడిపి తరపున పార్టీకి అండగా



నిలిచాడు. కాల క్రమంలో ఆర్థిక ఇబ్బందులు పడుతూ మనవరాలు నాగ మల్లేశ్వరిని ఇంజనీరింగ్ విద్యను చదివించలేక డబ్బుల కొసం ఇబ్బంది పడుతున్న విషయాన్ని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లాడు. వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఆర్థిక పరిస్థితికి చలించిన ఎమ్మెల్యే వెంటనే రెండవ రోజు స్వయంగా గోవిందాపురం గ్రామంలోని వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి మల్లేశ్వరి చదువుకు ఎంత ఖర్చు అవుతుందో అడిగి తెలుసుకొని మూడు సంవత్సరాలకు కలిపి మూడు లక్షల 50 వేల రూపాయలు అందిస్తానని చెప్పి, కుటుంబ పోషణ కొరకు తక్షణమే 50వేల రూపాయలు నగదును అందించి ముదిరాజుల జాతి పట్ల ఆయన మంచితనం చాటుకుని ముదిరాజ్ జాతి పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్న ఆయన సేవ భావం, ఆయన నాయకత్వాన్ని" సీనియర్ జర్నలిస్ట్ "ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టేటి రాజేంద్రప్రసాద్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గువ్వల సైదయ్య ముదిరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునగాల శ్రీనివాసరావు ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ పిడుగురాళ్ల పట్టణ అధ్యక్షులు నార బోయిన నరసింహారావు ముదిరాజ్, బుధవారం మహాసభ మండల నాయకులు గోగుల సైదులు ముదిరాజ్ మాజీ సర్పంచి పోతురాజు వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా దాచేపల్లి మున్సిపాలిటీలో కోటి రూపాయల విలువైన ఎకరం స్థలాన్ని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అందించాడని, అలాగే లైన్ సిటీ పిడుగురాళ్ల బైపాస్ రోడ్ లో 75 లక్షల విలువైన 25 సెంట్లు స్థలాన్ని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అందించాడని అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని, ఇలాంటి ఆర్థిక సహాయ, సహకారాలు అందించిన యరపతినేని శ్రీనివాసరావు కి ముదిరాజ్ జాతిమొత్తంరుణపడిఉంటుందనివారుతెలియజేశారు.

# పార్టీ సిద్ధాంతాలతో , స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం గా కార్యకర్తల సమావేశంలో ప్రసంగించిన, కరాటం. రాంబాబు



**జనసముద్రం న్యూస్, కొయ్యలగూడెం మండల రిపోర్టర్ ఈ.మనోహర్, సెప్టెంబర్ 02,**

ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండలంలోని జనసేన పార్టీ అధినేత , ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కొయ్యలగూడెం పట్టణంలో మండల అధ్యక్షులు తోట రవి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చెసి ఘనంగా నిర్వహించారు, అనంతరం మండల కేంద్రంలో ఉన్న గణపతి సెంటర్ వద్ద నుండి ర్యాలీ గా కరాటం వై జంక్షన్ వద్ద గల దండమూడి కళ్యాణమండపం వద్ద కు చేరి అక్కడనుండి జంగారెడ్డిగూడెం పట్టణంలో జనసేన నాయకులంతా కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, కళ్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. పోలవరం నియోజకవర్గ జన సైనికుల మండపం వద్ద ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా కరాటం. రాంబాబు, గడ్డమణుగు. రవికుమార్, కరాటం. సాయి, కరాటం.ఉమ, వాడపల్లి.రమేష్, పాదం. కృష్ణ, హాజరయ్యారు, ఈ సందర్భంగా కరటం సాయి మాట్లాడుతూ జనసేన





పార్టీ స్థాపించినప్పటి నుంచి నేటి వరకు బలమైన శక్తిగా అభివృద్ధి చెందిందని అన్నారు, నియోజకవర్గ జనసేన కార్యకర్తలు అధైర్య పడవద్దని అన్నారు. పార్టీలో అవంతరాలు వస్తుంటాయి, పార్టీ ప్రతి ఒక్కటి గమనిస్తూ ఉందని సాయి అన్నారు, గడ్డమణుగు రవికుమార్ ప్రసంగిస్తూ పవన్ కళ్యాణ్ ఆశయ సిద్ధతం కోసం అందరం పని చేస్తున్నాం అని, నియోజక వర్గం లో ఏమి జరుగుతుందో ప్రజలంతా చూస్తున్నారని అన్నారు

.రానున్న ఎన్నికలలో జనసేనా పార్టీని గెలిపించడం లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు, ముఖ్య అతిథిగా పాల్గొని నా కరాటం. రాంబాబు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతు ఇటీవల కాలంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి ఏపురి. సతీష్ పై జరిగిన దాడికి మనందరం సానుభూతి తెలపాలని అన్నారు. తన అనుభవంలో ప్రజలయొక్క కష్టాలను చూడటం జరిగిందని అన్నారు, పోలవరం ప్రజెక్టును నిర్మించడానికి చాలా కష్టపాల్సి వచ్చిందని ఆయన తెలిపారు, రాష్ట్రంలో వున్న గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు వేయడానికి ప్రధాన కారణం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని అన్నారు, పోలవరం నియోజకవర్గశీ లో అలివేరు, పోగొండ, ఎర్రకాలువ జలాశయం, పోలవరం ప్రాజెక్టు లు కట్టడం వల్ల డెల్టా ప్రాంతమంతా అభివృద్ధి చెందిది అని అన్నారు. గ్రామాల్లో కమిటీలను సక్రమంగా నిర్వహించాలని , స్థానిక పంచాయితి లలో జనసేన జెండ ఎగురవేసి అధినేత పవన్ కళ్యాణ్ కు పుట్టిన రోజు కానుకగ ఇవ్వాలని నాయకులకు కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, అండగా ఉంటానని హామీ ఇచ్చారు, అనంతరం కేక్ కటింగ్ రాంబాబు చేతులు మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి. శ్రీనివాస్, మన్నిడి. సాయిబాబా,కోన. కుమార్, నక్క బాబి, టీ నరసాపురం మండల అధ్యక్షుడు అడపా.నాగరాజు, జీలుగమిల్లి మండల అధ్యక్షుడు పసుపులేటి. రాము, వేలేరుపాడు మండల అధ్యక్షుడు అధినరాయణ, కుక్కునూరు మండల అధ్యక్షుడు మున్ని శెట్టి యుగేంద్ర, బుట్టాయిగూడెం మండల అధ్యక్షుడు మెట్ట బుచ్చిరాజు, పోలవరం మండల అధ్యక్షుడు గున పర్తి.చిన్ని నియోజకవర్గంలో ఉన్న నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నరసాపురం నియోజకవర్గంలో కూటమికి బీటలు తప్పవా..?




**మొగల్తూరు సెప్టెంబర్ 02 జనసముద్రం ప్రతినిధి**

నరసాపురం నియోజకవర్గంలో కూటమి రాజకీయాల్లో అంతర్గత విభేదాలు తెరపైకి వస్తున్నాయా? నాయకుల మధ్య సమన్వయం లోపిస్తోందా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ముందుకు సాగుతున్నప్పటికీ స్థానిక స్థాయిలో నేతల మధ్య నెలకొంటున్న విభేదాలు పార్టీ శ్రేణుల్లో చర్చకు దారితీస్తున్నాయి. రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సేవలో ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో ప్రజల సమక్షంలో స్థానిక శాసనసభ్యుడు పనిచేయటం లేదని చేసిన ఆరోపణ పట్ల జనసైనికులు రాజకీయ పరిశీలకుల్లోనూ పెద్ద చర్చ నియాంసమైంది.

నరసాపురం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు, వర్గ విభేదాలు తలెత్తుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా స్థానిక రాజకీయ అంశాల్లో ఎవరి మాటకు ప్రాధాన్యం దక్కాలి? అనే విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కూటమి పార్టీల కార్యకర్తలు మాత్రం నాయకత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరుతున్నారు. చిన్నచిన్న విభేదాలు పెద్ద సమస్యగా మారకముందే అధిష్ఠానం జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని ఆశిస్తున్నారు.

రానున్న స్థానిక రాజకీయ పరిణామాలు, నాయకుల మధ్య సమన్వయం ఎలా ఉంటుంది? కూటమి ఐక్యతను కాపాడేందుకు అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నాయకుల మధ్య విభేదాలు కొనసాగితే కూటమికి రాజకీయంగా బీటలు పడతాయా? లేక సమన్వయంతో మరోసారి బలమైన ఐక్యతను చాటుతారా? అనేది వేచి చూడాల్సిందే.

# రాయచోటి లో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**లక్కీరెడ్డి పల్లి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 2**

అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మైనార్టీ నాయకుడు మన్సూర్ అలీ, నిమ్మనపల్లి పవన్ కుమార్ ఆధ్వర్యంలో పండుగ వాతావరణం లో ఘనంగా నిర్వహించారు.....

మాండవ్య నది ఒడ్డున వెలసిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నందు ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి 101 టెంకాయలను సమర్పించి అనంతరం అక్కడి నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరి ఎన్జీవో హోం వద్దకు చేరుకుని భారీ కేకును కట్ చేశారు..ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు



**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....**

నాలుగవ స్థానంలో ఉన్న పంచాయతీరాజ్ శాఖ ను మొదటి స్థానంలో నిలబెట్టినటువంటి ఘనత పవన్ కళ్యాణ్ కే దక్కుతుందన్నారు.



ప్రజల కోసం నిరంతరం కృషి చేసే నాయకుడు సేవాభావంతో ముందుకు సాగే వ్యక్తిత్వం కలిగి యువతకు స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అలాంటి నాయకత్వంలో నడిచేందుకు జనసేన కార్యకర్తలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు.....

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- మాచర్లలో జనసేన శ్రేణుల భారీ బైక్ ర్యాలీ
- రక్తదాన శిబిరం నిర్వహించి సేవా స్ఫూర్తి చాటిన జనసైనికులు







**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సెప్టెంబర్ 2;**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు మాచర్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త భూసా రామాంజనేయులు ఆధ్వర్యంలో గురువారం మాచర్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.వేడుకల్లో భాగంగా ముందుగా నెహ్రూనగర్ నుంచి రింగ్‌రోడ్డు సెంటర్ వరకు జనసైనికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండాలతో నిర్వహించిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అనంతరం పట్టణంలోని వివిధ ఆలయాల్లో పవన్ కళ్యాణ్ పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన ఆయురారోగ్యాలతో ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీనివాస మహల్‌లో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవా స్ఫూర్తిని చాటారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి సహాయం చేయవచ్చుని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా జనసేన నాయకులు భూసా రామాంజనేయులు, పులిహరి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రజాసేవ, సామాజిక బాధ్యత, పేదల పట్ల సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా జనసేన శ్రేణులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో లాల్ కృష్ణగౌడ్,మదీన్, వినోద్, మల్లయ్య, సాంబశివరావు, కృష్ణబాబు, నరసింహారావు, ఫారుక్, శ్రీహరి, లక్ష్మణ్, లింగం, రంగా, దళపతి, కొప్పుల వెంకటరమణ, రుద్రాల రవి, కటకం నరేష్‌తో పాటు పలువురు జనసేన నాయకులు, జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

# వైసీపీని వీడి టీడీపీలో చేరిన 20 కుటుంబాలు



**నెల్లూరు, సెప్టెంబర్ 2, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**
తోటపల్లి గూడూరు మండలం మాచర్లవారిపాళెం పంచాయతీ నక్కావారిపాళెంకు చెందిన 20 కుటుంబాలకు ఆత్మీయ ఆహ్వానం పలికిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
పొన్నలూరు శివకోటారెడ్డి ఆధ్వర్యంలో అల్లీపురంలోని తమ నివాసానికి వచ్చిన వారికి టీడీపీ కండువాలు కప్పిన సోమిరెడ్డి టీడీపీలో ఇప్పటికే ఉన్న నాయకులతో సమన్వయంగా ముందుకు సాగి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి
స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల విజయం ఖాయమైపోయింది ఓటమి భయంతో వైసీపీ నేతలు రకరకాల కారణాలతో కోర్టుల్లో కేసులు వేస్తున్నారనీ ఎన్నికలు జరగడం వైసీపీ నాయకులకు ఇష్టం లేదు..జరిగితే ఘోర ఓటమి తప్పదనే భయంలో ఉన్నారు
16వ ఫైనాన్స్ నిధుల కోసం స్థానిక సంస్థల ఎన్నికలు త్వరితగతిన నిర్వహించడం తప్పనిసరి ఎన్నికలు జరిగితే సుమారు 25 వేల కోట్లకు పైగా నిధులు పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు జమవుతాయనీ ఆ నిధులు ఆగిపోవాలి. అభివృద్ధి జరగకూడదనే దురుద్దేశంతో వైసీపీ ఉందనిబ్యేలిపారు.
టీడీపీలో చేరిన వారిలో ఓసురు శ్రీనయ్య, సండీ నాగరాజు, కొండ సుధాకర్, నక్క సుబ్బయ్య, తన్నీరు వీరయ్య, ఓసురు మల్లికార్జున, యాటాగిరి రవి, ఓసురు వెంకటేశ్వర్, ఓసురు శరుమూడి, ఓసురు శ్రవణ్ కుమార్ తదితరులు.

# కొప్పునూరు గ్రామంలో మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి కి ఘన నివాళి..!!

## మాజీ సర్పంచ్ కొప్పుల శ్రీనివాసరెడ్డి



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల మండలం, సెప్టెంబర్ 2;**
మరుపురాని మహానేత, పేదల పెన్నిధి, రైతు బాంధవుడు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి గారి 17వ వర్ధంతి సందర్భంగా కొప్పునూరు గ్రామంలో బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న మహానేత వై.యస్.ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు.

**ఈ సందర్భంగా మహానేత వై.యస్.ఆర్ సేవలను స్మరించుకుంటూ**

కొప్పునూరు మాజీ గ్రామ సర్పంచ్ కొప్పుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూపేదల సంక్షేమం.. రైతుల అభ్యున్నతి.. బడుగు బలహీన వర్గాల భవిష్యత్తు.. ఇవే లక్ష్యాలుగా ప్రజా సంక్షేమ పాలనకు కొత్త అర్థం చెప్పిన మహానేత డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి. రైతులకు ఉచిత విద్యుత్, జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావడం, 108 అత్యవసర సేవలు, 104 ఆరోగ్య సేవలు, పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలతో కోట్లాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వై.యస్.ఆర్.
అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ సాగునీరు, రహదారులు, విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసి, "ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం" అనే పాలనకు చిరస్మరణీయమైన నిదర్శనంగా నిలిచారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వై.యస్.ఆర్ సేవలు, ఆశయాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం.!
"ఆయన లేరుడ కానీ ఆయన అందించిన సంక్షేమ ఫలాలు, ప్రజల హృదయాల్లో ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచే ఉంటాయి." ఆయనతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని వైయస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు.

# ద్వారకాతిరుమలలో ఘనంగా వైయస్సార్ 17వ వర్ధంతి... నివాళులర్పించిన నాయకులు.



**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా సెప్టెంబర్ 2 ద్వారకాతిరుమల**
దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా బుధవారం ద్వారకాతిరుమల మండల కేంద్రంలో ఆయన వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షులు అచ్యుత ఏసుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైయస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ వంటి చారిత్రాత్మక పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండల నాయకులు ప్రతాపనేని శ్రీనివాసరావు (వాసు), బొండాడ వెంకన్న బాబు, రుద్ర వెంకట శివాజీ, ఉక్కుర్తి వెంకటరావు, జంగా కృష్ణారెడ్డి, గుర్రాల లక్ష్మణరావు, దూలపల్లి ప్రసాద్, బొంతు శ్రీనివాస్, చిలుకూరి చంద్రశేఖర రావు, కొల్లి సుబ్బారావు, రామాయణం నాగ చారి, పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

# చోరీల నివారణకు చర్యలు

## ద్వారకాతిరుమలలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు, విద్యుత్ ప్రమాదాల నివారణపై పోలీసు, విద్యుత్ అధికారుల ఉన్నతస్థాయి సమావేశం



**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా సెప్టెంబర్ 2 ద్వారకాతిరుమల**
ద్వారకాతిరుమల మండలంలో పామాయిల్ తోటల్లో తరచూ చోటుచేసుకుంటున్న ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు మరియు విద్యుత్ ప్రమాదాల నివారణకు పోలీసు, విద్యుత్ శాఖాధికారుల బుధవారం సంయుక్త ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్, డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు భీమడోలు ఇన్‌స్పెక్టర్ కృష్ణ మరియు ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. మండలంలోని లైన్‌మెన్‌లు, ఏడీ మరియు ఏఈ విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. తోటల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకు పటిష్టమైన లాకులు, ఇనుప గ్రిల్స్ ఏర్పాటు, అనుమానాస్పద వ్యక్తులు, స్క్రాప్ వాహనాలపై నిఘా, రాత్రి గస్తీ పటిష్ఠం వేలాడుతున్న విద్యుత్ తీగలకు సత్వర మరమ్మతులు అనధికార కనెక్షన్ల తొలగింపు రైతులకు విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సుల అత్యవసర సమయాల్లో స్పందించేలా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఏర్పాటు ఏదైనా చోరీ జరిగినా, ప్రమాదం జరిగినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, అందరూ సమన్వయంతో పనిచేసి నేరాలను అరికట్టాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ప్రజల వద్దకే మంత్రులు.. అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యక్ష సమీక్ష



- సెప్టెంబర్ 5న రాయచోటిలో మంత్రుల బృందం పర్యటన
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ప్రజా చేరువ' కార్యక్రమం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**రాయచోటి, జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 2:**
ప్రజలకు మరింత చేరువగా ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతోసెప్టెంబర్5వతేదీనరాయచోటినియోజకవర్గంలో మంత్రుల బృందం పర్యటించనుందని రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలోతెలిపారు.
రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి మరియు అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కలిసి రాయచోటి నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

**ప్రజలు, పార్టీ శ్రేణులతో నేరుగా మంత్రులు**

సెప్టెంబర్ 5న ఉదయం రాయచోటిలో మంత్రుల పర్యటన ప్రారంభమై, అనంతరం ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించనున్నారు.
రాష్ట్రప్రభుత్వప్రాధాన్యతాకార్యక్రమాలు,నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, విద్యుత్, రవాణా తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

**అభివృద్ధి పనులపై మంత్రుల సమీక్ష**


రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి రోడ్లు, విద్యుత్, రవాణా తదితర శాఖల పరిధిలోని అంశాలపై మంత్రులు అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించి తగిన చర్యలకు ఆదేశాలు ఇవ్వనున్నారు.
అనంతరం కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

**ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం**

ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కార మార్గాలను చూపించడం ప్రజా చేరువ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.
రాయచోటి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రుల పర్యటన దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు.
పై కార్యక్రమాలలో నియోజకవర్గంలోని కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులు

## రామాపురం లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు, వెలిగల్లు జలాలతో అభిషేకం





**రామాపురం, జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 2:**
మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నివాళులర్పించారు. రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పిలుపు మేరకు రామాపురం మండలంలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, వెలిగల్లు ప్రాజెక్టు జలాలతో అభిషేకం చేసి ఘన నివాళులర్పించారు.
ఈ కార్యక్రమంలో ప్రజలు, వైఎస్సార్ అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని "జోహార్ వైఎస్సార్" అంటూ మహానేతను స్మరించుకున్నారు. వైఎస్సార్ ప్రజల కోసం చేసిన సేవలను, పేదల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.
అనంతరం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా అనేక విప్లవాత్మక పథకాలను అమలు చేశారని అన్నారు. జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి కార్యక్రమాలతో అండగా నిలిచారని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య, పావలా వడ్డీ ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు ప్రోత్సాహం అందించారని పేర్కొన్నారు. పేదల గృహ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, రాయచోటి ప్రాంత అభివృద్ధి కోసం వెలిగల్లు ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారని గుర్తుచేశారు.
ఈ సందర్భంగా మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డితో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గడికోట మోహన్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. వైఎస్సార్ తనపై చూపిన ప్రేమ, ఆప్యాయతలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. మహానేత ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- పుల్లలచెరువు లో అభిమానుల సందడి
- భారీ బైక్ ర్యాలి.



**జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 2 పుల్లల చెరువు.**
జనసేనపార్టీఅధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన పుల్లలచెరువు లో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా పుల్లలచెరువు స్థానిక ఆర్టిసి బస్టాండ్ నుండి గ్రామంలో జనసేన పార్టీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలునిర్వహించి, పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో మరిన్నిపుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం జనసేన పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేసి పవన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. అభిమానులు, ప్రజలతో నాయకులు మమేకమై కేక్ కటింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకటేశ్వరరావు పసుపులేటి వెంకటేశ్వరరావు, ముద్దా లక్ష్మయ్య, సోమిశెట్టి వాసు, వచ్చిన బోయిన వెంకటేశ్వర్లు, పవన్, గోపి, సిరిగిరి రామాంజి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

H.O. Mobile : 9494184136
JANASAMUDRAM NEWS
Telugu Daily
RNI APTEL : 16151
జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
Published by Rajeshwari Publications
www.janasamudram.com fb/janasamudram 9494184136

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL / 2021 / 16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb / janasamudram